Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 81 • సంచిక: 4 • 22-1-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
దంతవైద్యశాల
నందేమార్కెట్ దగ్గర, పొగతోట, నెల్లూరు. సెల్: 99083 22007

లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

## పిచ్చివేషాలేస్తే టిక్కెట్ ఎగనామం!

తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల పేరుతో తమ పదవులకు రాజీనామాలు చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అధిష్టానం గట్టి హెచ్చరిక చేస్తున్నది. రాజీనామాల కోసం పట్టుబట్టి, స్పీకర్ మీద ఒత్తిడి తెచ్చి, ఆమోదించుకోవాలని చూసేవారందరికీ భవిష్యత్తులో ఎప్పుడూ పార్టీ టిక్కెట్ ఇచ్చేది లేదని తేల్చి చెప్తున్నది. తెలంగాణ అంశాన్ని సానుకూలంగా పరిష్కరిస్తామని, అప్పటి వరకు వేచి చూడమని పదే పదే చెప్తున్నా విన్పించుకోకుండా ప్రతిపక్షాలతో జతకట్టి రాజీనామాల ప్రహసనం నడపడం సోనియాగాంధీకి చెడ్డ చిరాకు పుట్టిస్తున్నదట. ఆమె చాలా కోపంతో వున్నారు. ఇటువంటి పిచ్చివేషాలు వేసేవారికి నా మాటగా చెప్పండి, భవిష్యత్తులో ఏ ఎన్నికలోనూ వీరికి పార్టీ టిక్కెట్ ఇచ్చే ప్రశ్నే వుండదని హెచ్చరిక చేయండని వీరప్ప మొయిలీని ఆదేశించారట. ఆ వార్త బయటకు పొక్కినప్పటి నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్పీలలో గుబులు పుడుతున్నది. అధిష్టానానికి భయపడి రాజీనామా ఉపసంహరించుకొంటే తెలంగాణ ప్రజలు తరిమి తరిమి కొడతారని భయం. అట్లని రాజీనామాలు చేస్తే పార్టీలో ఇక మనుగడ ఉండదని ఆందోళన. మధ్యలో నలిగిపోతున్నారు పాపం.

### కార్టూన్ స్కేప్




స్వారీ చేస్తున్నాడు...
గుర్రం మాత్రం ముందుకు పోవట్లేదు!

● అరాచకం గుప్పెట్లో తెలంగాణ ప్రాంతం

# జడిపిస్తున్న జెఎసి!

టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మహామేధావి. ఎత్తులు పై ఎత్తులు వేయడంలో, కుటిల పన్నాగాలు పన్నడంలో అలనాటి శకుని మామకు సరిజోడు. తెలంగాణ ఉద్యమాన్ని జెఎసిల చేతికి అప్పచెప్పడం అందుకొక తాజా రుజువు. డిసెంబర్ 23తేది కేంద్ర హోంమంత్రి చిదంబరం చేసిన సవరణ ప్రకటన వెలువడిన వెంటనే తెలంగాణ భవన్ విడిచిపెట్టి కాంగ్రెస్‌నేత జానారెడ్డి నివాసానికి పరుగులు తీయడం ద్వారా మొత్తం తెలంగాణ ఉద్యమాన్నే అరాచక దిశకు మళ్లించాడు కెసిఆర్. అప్పటికి కాంగ్రెస్‌వాదులు ఉద్యమంలో చురుకుగా లేరు. ఉద్యమం టిఆర్ఎస్ వద్దనే కేంద్రీకృతమై వుంది. చిదంబరం ప్రకటన రాగానే తన తెలంగాణ భవన్ నుంచే కెసిఆర్ దానికి సమాధానం చెప్పి వుండవచ్చు. తానొక్కడి వల్ల ఉద్యమం ముందుకు వెళ్లడం జరిగే పని కాదని క్షణం వ్యవధిలో అర్థం చేసుకొని జానారెడ్డిని ముగ్గులోకి దింపాడు. జానారెడ్డి ఒక అమాయక జీవి. కెసిఆర్ ఎత్తు అర్థం చేసుకోలేక పోయాడు. నిజానికి అదే సమయానికి ముఖ్యమంత్రి రోశయ్య తరపున జెసి.దివాకర్‌రెడ్డి కూడా జానారెడ్డి నివాసానికి బయలుదేరాడు. నిన్ను ఉపముఖ్యమంత్రిగా నియమించబోతున్నాము, సిఎం ఇంటికి వెళ్దాం రా అని పిలుచుక రావడం జెసి.దివాకర్‌రెడ్డి రాయబారం. ఈ లోగానే కెసిఆర్ అక్కడకు చేరుకొని జానారెడ్డి చేత తెలంగాణ ఉద్యమ ప్రకటన చేయించడంతో జెసి వెనక్కు మళ్లక తప్పలేదు.

కెసిఆర్ ఆ రోజు వేసిన ఎత్తుగడ ఎంత ప్రమాదకరమైనదో ఇప్పుడు అర్థమౌతున్నది. జెఎసి ఆలోచన పుట్టింది అక్కడే. అదిప్పుడు మహామర్రి చెట్టుగా విస్తరించింది. ఇరాన్ ఖొమైనీ వలె, ఆఫ్ఘనిస్తాన్ ముల్లాల వలె ఫత్వాలు జారీ చేసే స్థాయికి ఎదిగిపోయింది. ఉద్యమంలో ఎవరేమి చేయాలో జెఎసి చెప్తున్నది. దాని మాట కాదంటే జనంలో గబ్బు పట్టి పోవల్సి వస్తున్నది. కాంగ్రెస్ అయినా, టిడిపి అయినా జెఎసికి లోబడి పనిచేయవల్సిన దుర్గతి దాపురించింది. తమ తమ పార్టీ వేదికలలో చర్చించుకోవడం, తమ పార్టీ ప్రయోజనాలు విధానాలకు అనగుణంగా నిర్ణయాలు తీసుకోవడం




జరగడం లేదు. ఆ స్వేచ్ఛ అందరూ కోల్పోయారు. పక్కా మావోయిస్టు భాషలో, పదజాలాలలో తెలంగాణ ద్రోహులు, దగాకోరులు అంటూ నిందలు వేస్తున్నారు. ఆ ముద్ర పడితే వూళ్లలో తిరగలేని

కొరవ 14వ పేజీలో

## తెలంగాణ రణానికి నరసింహన్ వ్యూహం!

ఇఎస్ఎల్ నరసింహన్ ఈ రోజు (22) పూర్తికాలం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. గత మూడు వారాలుగా ఆపద్ధర్మంగా వ్యవహారాలు నడిపిస్తున్న ఆయన ఇక నుంచి పూర్తికాలం ఇక్కడే వుండబోతున్నాడు. మామూలు పరిస్థితులలో అయితే గవర్నర్ రాకపోకలకు పెద్ద ప్రాధాన్యతలేదు. అలంకారప్రాయ పదవి కాబట్టి ఎవరూ పట్టించుకోరు. కానీ నరసింహన్ పరిస్థితి వేరు. నిర్దుష్టమైన ప్రణాళికతో హైదరాబాద్ వచ్చారాయన. అల్లకల్లోలంగా, అరాచకమయంగా వున్న రాష్ట్ర పరిపాలనను గాటిలో పెట్టడం ఆయన నియామక ఉద్దేశం. అసలే పోలీసు అధికారి. నిఖార్సైన వ్యక్తిత్వం. నక్సలైట్లతో చావు ఆటలంటే మహా ఇష్టం. కేంద్ర నిఘా విభాగం బాస్‌గా పనిచేసిన అనుభవం. అన్నిటికీ మించి హోంమంత్రి చిదంబరం నుంచి ఫ్రీ లైసెన్స్. ఇక చెప్పాలా. చెలరేగిపోవడానికి సన్నాహాలు చేసుకొంటున్నాడు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి రోశయ్య అయినా రేపటి నుంచి పాలనా పగ్గాలు సమస్తం నరసింహన్ చేతుల్లో కేంద్రీకృతం అవుతాయని చెప్పడానికి సందేహం అవసరం లేదు. తెలంగాణ ఉద్యమంలో



మావోయిస్టు దళాల పరోక్ష ప్రమేయం వుందని నరసింహన్‌కు గట్టి నమ్మకం. అందువల్ల ఉద్యమాన్ని భావోద్రేకాల కోణంలో కాకుండా, శాంతిభద్రతల రూపంలో ఎదుర్కోవాలని భావిస్తున్నాడు. పోలీసు బలాన్ని పూర్తి స్థాయిలో వినియోగించి ఉద్యమకారుల భరతం పట్టాలన్నది ఆయన ఆలోచన. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోపు ఉద్యమాన్ని పూర్తిగా అణిచి వేయాలనే పథక రచన జరుగుతున్నది రాజ్‌భవన్‌లో. అరవిందరావు, గిరీష్‌కుమార్ వంటి పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు పూర్తి మద్దతు పలుకుతున్నారు. వారి వ్యూహం ఫలిస్తే రానున్న ఒకటిరెండు వారాలలో తెలంగాణలో పోలీసులకు ఉద్యమకారులకు మధ్య పెద్ద యుద్ధమే జరగడం ఖాయం. దాని ఫలితాలు ఎట్లా వుంటాయో వేచి చూడాల్సిందే.

# అరుణ తార

భారత కమ్యూనిస్టు పార్టీ భీష్మ పితామహుడు జ్యోతి బసు మనకిక లేడు. వినీలాకాశంలో అరుణ తారగా మిల మిల లాడడానికి ఇహ లోకం వీడి వెళ్లిపోయాడు. అమరజీవి అనే పదానికి నిర్వచనం ఆయన జీవితం. జన హృదయా లలో, ఆ జనం గొంతులో వూపిరున్నంతకాలం స్థిరంగా, శాశ్వతంగా, చిరంజీవిగా నిలిచిపోయే అద్భుత నాయకత్వం. ఆయన పదహారణాల కమ్యూనిస్టు. తన జీవితకాలంలో కలలో కూడా ఆ పార్టీకి మాత్రమే కట్టుబడి వున్నాడు. ఆ పార్టీ సిద్ధాంతాలనే మనసావాచా కర్మణా విశ్వసించాడు, ఆచ రించాడు. కానీ ఆయన అంతిమ ఘడియలు సమీపించిన క్షణం నుంచి పార్టీ, ప్రాంతం, దేశం అన్న ఎల్లలు లేకుండా యావత్ ప్రపంచ ప్రజానీకం ఆయన కోసం పరితపించింది. కన్నీటి బొట్లు రాల్చింది. ఆయన అంతిమ యాత్రకు లక్షలాది జనం కదలి వచ్చారు. సువిశాలమైన కలకత్తా నగరం ఇరుకై పోయింది. కలకత్తా నగరాన్ని మానవ సునామీ ముట్టడిం చిందా అన్న సందేహం కలిగే రీతిలో జ్యోతిబసుకు వీడ్కోలు పలికారు భారతీయులు.

జ్యోతిబసుది సంపన్న కుటుంబ నేప థ్యం. అందువల్లనే లండన్ వెళ్లి వున్నతవిద్య చదవగలిగాడు. కానీ ఆ విదేశీగడ్డ మీద వున్నప్పుడే ఆయన మనసులో కమ్యూనిస్టు బీజాలు మొల కెత్తాయి. విద్యార్థిదశలోనే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమా లలో పాలుపంచుకొన్నాడు. భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత కుటుంబం ఎంత ఒత్తిడి చేసినా ఆయన దృష్టి వృత్తి, వ్యాపార కార్యకలాపాల మీదకు మళ్లలేదు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, కార్యక్రమాలు ఆయన్ను అయస్కాం తం వలె ఆకర్షించాయి. సర్వం పరిత్యజించి వాటికే అంకి తమై పోయారు. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు మార్కిస్ట్ వైపుకు మొగ్గు చూపాడు. సిపిఎం ఆవిర్భావకర్తలలో ఆయనొకరు. అప్పటినుంచి చివరి శ్వాస పీల్చే వరకు జ్యోతి బసు సిపిఎం సెంట్రల్ కమిటీ సభ్యుడు. పశ్చిమబెంగాల్ శాసనసభకు ఆయన 12సార్లు ఎన్నికైనాడు. 1946 నుంచి 2001లో తనంతట తానుగా విరమించుకొన్నంత వరకు జరి గిన ప్రతి ఎన్నికలో ఆయన గెలిచాడు. ఓటమి అన్నది ఆయన జీవితంలో లేనేలేదు.

భారతదేశ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం ముఖ్యమం త్రిగా పని చేసిన ఘనత జ్యోతిబసుదే. 1977 నుంచి 2000 సంవత్సరం వరకు ఆయన బెంగాల్ రాష్ట్రాన్ని ఏకఛత్రాధి పత్యంగా పాలించాడు. అంత సుదీర్ఘకాలం ఒక రాష్ట్రానికి అధిపతిగా వున్న ఆయనకు బద్ధ విరోధులు కూడా ఆయనలో వేలెత్తిచూపే తప్పు కనిపెట్టలేకపోయారంటే, జ్యోతిబసు ఎంత ఆదర్శ రాజకీయవాదో అర్థం చేసుకోవచ్చు. మతకలహాలు, అలజడులు, ఆందోళనలకు ఆలవాలమైన బెంగాల్ రాష్ట్రంలో శాంతిభద్రతలను నెలకొల్పిన సమర్ధ పాలకుడిగా చరిత్రలో నిలిచిపోయాడు. అయితే ఆయన పాలన, బెంగాల్ రాష్ట్రాన్ని ఆర్థికంగా చితికిపోయేట్లు చేసింది. కార్మిక పక్షపాతంతో పారి శ్రామికుల పట్ల సానుకూలత చూపకపోవడంతో అభివృద్ధి అణగారిపోయింది. ఆ లోపాన్ని భూసంస్కరణల సక్రమ అమలు, రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల సరఫ రాలతో పూరించాడు. ప్రజల జీవన ప్రమాణాలు పతనం కాకుండా కాపాడాడు.

జమీన్‌రైతు

బెంగాల్ రాష్ట్రం నుంచి దేశ ప్రధాను లుగా ఎదగగలిగిన భాగ్యం చరిత్రలో ఇద్ద రికే వచ్చింది. మొదటివాడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. విమాన ప్రమాదం ఆయన్ను పొట్టనబెట్టుకొంటే, జ్యోతిబసును స్వంతపార్టీ నేతలే అడ్డుకొన్నారు. 1996 యునై టెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి ఆయన నేతృత్వం కావాలని దేవ గౌడ, చంద్రబాబు వంటి వారంతా పట్టుబట్టారు. కానీ సిపిఎం కేరళ నాయకత్వం అందుకు అడ్డుపుల్ల వేసింది. అంత నిరా శలోను జ్యోతిబసు తన పార్టీ వారిని తప్పు పట్టలేదు. అదొక చారిత్రాత్మక తప్పిదం అని మాత్రమే వ్యాఖ్యానించి సరిపెట్టు కొన్నారాయన. జ్యోతిబసు ప్రధాని అయివుంటే దేశ భవిష్యత్తు ఏ విధంగా వుండేదో వూహించలేము. ఈ దేశం గర్వించదగిన మహానేతలలో జ్యోతిబసు ఒకరన్నది ఎవరూ కాదనలేని నిజం. రాజకీయాలలో నాయకులు ఎట్లా వుండాలో ఎట్లా మెలగాలో ఆయన జీవితం ఒక ఉదాహరణ. ప్రతిఒక్కరూ నేర్చుకోవాల్సిన పాఠం. ఆ మహానేత మరణం యావత్ భారత జాతికి పూడ్చ లేని లోటు. ఆ అమరజీవికి జోహార్లు అర్పిస్తున్నాము.

## జనవాణి

### ఉద్యమాలతో రేట్లు పెరగవు

ఉద్యమాల వల్ల వివిధ వస్తువుల ధరలు పెరగవు. ఉద్యమాల ద్వారా ప్రజలు చైతన్యవంతమవుతారు. ప్రజాస్వామిక విలువలు పెంపొందుతాయి. రాజకీయనాయకుల స్వార్థపర చర్యలను నిలదీస్తారు. తమ హక్కులను సాధిం చుకొంటారు. చార్జీలు, ధరలు పెరగడానికి అసలైన కారణం తమ అడ్డగోలు సంపాదనకై సాధారణ ప్రజల బతుకులు కొల్లగొట్టే స్వార్థ రాజకీయ నాయ కులే. కుబేరుడ్ని తలదన్నడానికి ప్రయత్నించే ఆధునిక రాజకీయ, వ్యాపార ధనవ్యామోహాలు సాధారణ జనాన్ని కుచేల వారసులుగా మార్చేస్తున్నారు. నాయకుల అక్రమ సంపాదనను అడ్డుకోలేనన్ని రోజులు బస్సు చార్జీలేకాదు... నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే వుంటాయి.

పి.అరుణకుమారి, నెల్లూరు.

### ద్రౌపదికి అవమానం

మహాసాధ్వి ద్రౌపది. భారతాన్ని చదివే వారందరికీ తెలుసు. అటు వంటి పతివ్రతా శిరోమణిని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తన గ్రంథంలో కాముకిగా చిత్రీకరించడం, దీనికి సాహిత్య అకాడమి బహుమతి ఇవ్వడం మన పురా ణాలను, సంస్కృతి, నాగరికతలను, పుణ్య స్త్రీమూర్తులను అవమానించడమే. గతంలో కూడా లక్ష్మీప్రసాద్‌గారికే సాహిత్య అకాడమి బహుమతి ఇవ్వడం విడ్డూరమనిపిస్తుంది. తెలుగు సాహిత్య సారస్వతలోకం గొడ్డుపోయినట్లు ఈయన గారికే అవార్డులు... అవహేళనలే.

సుజాత, కావలి.

### విజయదీపిక విజయానికి సోపానం!

పదవ తరగతి చదివే విద్యార్థుల ఉపయోగార్థం జడ్పీఛైర్మన్ తన స్వంత డబ్బులు వెచ్చించి ప్రచురించి పంచిన విజయదీపిక పుస్తకం చాలా బాగుంది. దీన్ని చదివి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయి. జిల్లాలో విద్యా, క్రీడాభివృద్ధితోపాటు స్వచ్ఛమైన పాలనకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయం.

గడ్డం తిరుపాలురెడ్డి, మహమ్మదాపురం.

### సమరయోధుల ఫోటోలేవి?

నెల్లూరుజిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుల ఫోటోలు సుబే

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

26-1-1940
పేజీలు : 16 వెల: అణా

### మునిసిపల్ పరిపాలనా నివేదికలో అబద్ధము

నెల్లూరు మునిసిపల్ వాటర్‌వర్క్సు దగ్గర పెన్నానదిలో ప్రజలు బహిర్భూమికిపోయి అశుచి గావించ కుండా వుంచుటకై కావలివాడు వున్నాడని 1938-39 పరిపాలనా నివేదికలో తెలుపబడింది. ఆ కావలి వాని పేరేమి? వాని జీతమెంత? ఎన్ని గంటలు కావలా జరుగుతున్నదని అక్కన వెంకయ్యగారు జాబు వ్రాయగా 4-12-1939 తేదీ గల జవాబులో అసలు కావలా మనిషేలేదని ప్రస్తుత కమిషనరు తెలిపి నాడు. ఈ విధంగా పరిపాలనా నివేదికలో అబద్ధపు స్టేట్‌మెంట్ ప్రకటింపబడుటకు కారణమేమి?

### తుగ్లక్ ప్రభుత్వం

నెల్లూరు డిఇఓగారు తన స్వంత ఆఫీసును రాత్రి 9 గంటల దాకా పెట్టుకోవడమే కాదట; బళ్ల ఇన్స్ పెక్షన్ కూడా రాత్రి 8 గంటల వరకు జరిపి, 8 గంటలప్పుడు పిల్లకాయల చేత డ్రాయింగు వేయించి నాడట. వీరి విషయాలు వింటుంటే తుగ్లక్ జ్ఞాపకం వస్తున్నాడంటే తప్పుకాదనుకుంటా?

### బ్యాంకి ప్రెసిడెంట్

రేబాల లక్ష్మయ్య కోఆపరేటివ్ బ్యాంకి ప్రెసిడెంటుగా ఎన్నుకోబడ్డాడు. అన్నీ నాకే కావాలని కౌగ లించుకోకుండా ఇసిమెంబరు పదవిని వదలుకోనైనా లక్ష్మయ్య ప్రెసిడెంట్ షిప్పును బలపరచిన వంగల్లు కోదండరామిరెడ్డిగారి సమయానుకూల ప్రవర్తన ప్రశంసార్హము.

### బుచ్చి పంచాయతీ బోర్డు ఓటర్లకు విజ్ఞప్తి

ఈ పంచాయితీ బోర్డు అనేక సంవత్సరాలుగా ధనాఢ్యుల చేతిలో వుండుట వలన బీద బిక్కి పడు చుండిన బాధలు ఎరంగినవే. ఈ సంవత్సరం ఎన్నికలు ఫిబ్రవరి నెలలో జరుగునని తెలియుచున్నది. కాబట్టి ఓటర్లు మేల్కొని అందరికినీ అందుబాటులో నుండు యువకులను ఎన్నుకొనవలెనని కోరుచున్నాను.

– ఒక ఓటరు

## 50 ఏళ్ల క్రితం ఈవారం

22-1-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### ఏ.సి మంత్రిత్వానికి నెల్లూరులో ఆనందం

మంత్రిగా ఏ.సి సుబ్బారెడ్డి గారి ప్రథమ నెల్లూరు రాక ఆనందోత్సాహాలను కల్గించింది. వారు నెల్లూ రులో వున్న మూడు రోజులు టవున్‌లో జరిగిన సభలు, సన్మానాలు, సత్కారాలకు; విందులు, వినోదాలు, వేడుకలకు మేర లేదు. వచ్చిన క్షణం మొదలు వీడిన నిముషం వరకు అభిమానులు, అనుయాయులు కురిపించిన ప్రేమాభిమానాలలో మునిగితేలి, 22తేది మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరి పోయారు.

సుబ్బారెడ్డిగారు 19తేది మధ్యాహ్నం తిరుపతి నుంచి నెల్లూరు విచ్చేశారు. దారిలోనే కౌన్సిల్ సభ్యులు పొన్నలూరు వీరరాఘవరెడ్డిగారు గూడూరులో మంత్రిగారిని ఆపి, మంచి విందు కుడిపి, నెల్లూరుకు సాగ నంపారు. గూడూరులో జరిగే విందులలో యిది కల్తీ లేని కాంగ్రెస్ విందు అన్నారు పాల్గొన్న పెద్దలు. మంత్రిగా సుబ్బారెడ్డి గారికి స్వమండలంలో జరిగిన ప్రథమ విందు వీరరాఘవరెడ్డి గారిది.

### కప్పరాళ్ల తిప్ప దొంగలు

కావలి తాలుకాలోని కప్పరాళ్ల తిప్ప పాతదినాల్లలో గజదొంగల శిబిరం. స్వాతంత్ర్యానంతరం శిబి రాన్ని రద్దు చేసి; పాఠశాలలు పెట్టి, ఇతర వసతులు కల్పించి ప్రభుత్వం జేస్తున్న సంక్షేమ కృషి అంతా వృథా అవుతున్నదేమో ననిపిస్తున్నది. దొంగలు తమ వృత్తిని మానుకోలేదు. కలసికట్టుగా, సంఘటితంగా వీరు దొంగతనాలను సాగిస్తునేవున్నారు. ఇటీవల యిచ్చట ఒక టివిఎస్ లారీ డ్రైవరును దారి దోపిడి చేయ డం గూడా జరిగింది. ప్రజల ఆస్తి పాస్తులకు రక్షణ లేకున్నదని, వెంటనే చర్య దీసుకోవలసిందిగా బోగోలు, కాట్రాయపాడు, చింతలగిరివారి కండ్రిగ గ్రామస్తులు రాష్ట్ర పోలీసు శాఖాధిపతికి ఒక నివేదిక పంపారు.

జిల్లా సూపరింటెండెంటు గారు తగుశ్రద్ధ బుచ్చుకుంటారని ఆశిస్తున్నాము.

– ఓ.వి.

# నెల్లూరు ముచ్చట్లు

## భావి జీవితం పార్టీకే అంకితం!

ఇటీవలే షష్టిపూర్తి వేడుకలు చేసుకొన్న బిజెపి నాయకుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు తన భవిష్యత్ ప్రణాళికను 18వ తేది నెల్లూరులోని తన స్వగృహంలో విలేకరులకు వివరించారు. ఇక ఎన్నికల్లో పోటీచేయను. దేశవ్యాప్తంగా తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. సంస్థాగతపరంగా పార్టీ పురోగతికి పాటుపడతాను. ఇటీవల ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన పరిణామాలు తీవ్రంగా కలచివేశాయి. రాజకీయ విలువలు పూర్తిగా పడిపోతున్నాయి. మంచి నేతలు కరువయ్యారు. ఈ నేపథ్యంలో దేశానికి మంచి నాయకత్వం అందించేందుకు కృషి చేస్తానని తన మనసులోని మాటను వెంకయ్యనాయుడు చెప్పుకొచ్చారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ తరహాలో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో స్వర్ణభారత్ ఏర్పాటుకు కృషి చేస్తాను. సేవాదృక్పథం, అంకితభావంతో పనిచేసేవారికి దీని నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తానన్నారు.

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ సినీకాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435616, 9849495615

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

తెలుగుదేశం పార్టీ స్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు 14వ వర్థంతిని పురస్కరించుకొని నెల్లూరు తెలుగుదేశం పార్టీ నేతలు నర్తకి సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద 18వ తేది నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవాన్ని దశదిశల చాటిచెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని కీర్తించారు. మాజీమంత్రి రమేష్‌రెడ్డి, మాజీ మునిసిపల్ ఛైర్మన్ అనూరాధ, నెల్లూరు నగర పార్టీ అధ్యక్షుడు కిలారి వెంకటస్వామి నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ పాత సినిమాల్లోని స్టిల్స్‌తో రమేష్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బోర్డులు అందరినీ అలరించాయి.

## జ్యోతిబసుకు శ్రద్ధాంజలి!

పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు సంతాపసభ 18వ తేది టౌన్‌హాల్‌లో అఖిలపక్షం నేతృత్వంలో జరిగింది. డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సిపిఎం పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు జక్కా వెంకయ్య, నెల్లూరుసిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పముజుల దశరథరామయ్య జ్యోతిబసు నిరాబండర జీవితం, సిపిఎం పార్టీ ఉన్నతికి ఆయన చేసిన సేవలను ప్రస్తుతించారు. సిపిఎం జిల్లా కార్య దర్శి టిపిభానురాజు, మోహన్‌రావు తదితర నేతలు ఈ సభలో మాట్లా డారు.

## ఎన్టీఆర్ వర్థంతికి కాంగ్రెస్ నాయకులు!

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్ జరిపిన ఎన్టీఆర్ వర్థంతి వేడుకలకు కాంగ్రెస్ నాయకులంతా హాజరవ్వడం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. మేయర్ భానుశ్రీ, రూరల్ ఎమ్మెల్యే సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, ఈ ప్రాంతంలో వాణిజ్య ప్రముఖుడు, సీనియర్ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి కూడా హాజరయ్యారు. వీరంతా ఎన్టీఆర్ స్మృత్యంకంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తుతించారు.

## బురిడీచేసి చోరీ

నెల్లూరు నగరంలో మాయ మాటలు చెప్పి డబ్బు, నగలు తీసుకెళ్తున్న వారిని దోచుకోవడం రివాజుగా మారింది. 18వ తేది నెల్లూరు సరస్వతి నగర్‌కు చెందిన కె.నిరంజన్‌రెడ్డి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో లక్షా 20వేలు డ్రా చేసి బ్యాగులో పెట్టుకొని భోజనానికి కారును మద్రాసు బస్టాండ్ వద్ద పార్క్ చేస్తుండగా ఓ వ్యక్తి డబ్బులు క్రిందపడ్డాయని చెప్పాడు. ఆదుర్దాలో నిరంజన్‌రెడ్డి వాటిని వంగి తీసుకొంటుండగా కారులో డబ్బున్న బ్యాగు తీసుకొని ఆ వ్యక్తి ఉడాయించాడు. నగరంలో గత రెండేళ్లుగా ఇటువంటి దొంగతనాలు ఐదారు జరిగాయి. కానీ ఈ దొంగలను పట్టుకోవడంలో మాత్రం పోలీసులు విఫలమయ్యారు.

## సాగునీటి సలహాబోర్డు సమావేశం

ప్రస్తుతం సాగవుతున్న ఖరీఫ్, రబీ పంటలతోపాటు రెండవ పంటకు సోమశిల రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకొనేందుకు సాగునీటి సలహాబోర్డు సమావేశాన్ని కలెక్టర్ 28వ తేది గోల్డన్ జూబ్లీహాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంగం, నెల్లూరు బ్యారేజి, పెన్నాడెల్టా ఆధునీకరణ, కనుపూరు కాల్వ పనుల ప్రగతిని కూడా చర్చిస్తారు.

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

## ఉత్తరక్రియలు



డా. రేబాల సుబ్బరామిరెడ్డి
M.Com., Phd, M.Ed, B.L.,
Reader in Commerce (Rtd)
వి.ఆర్. కాలేజి, నెల్లూరు.

నెల్లూరు వి.ఆర్ కాలేజి కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో 30 ఏళ్లపాటు లెక్చరర్‌గా,
రీడర్‌గా వివిధ హోదాలలో పని చేసి వేలాది మంది విద్యార్థులను
వున్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్ది, అహర్నిశలు
మా అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి
గురు బ్రహ్మ శ్రీ రేబాల సుబ్బరామిరెడ్డి గారు
17-01-2010 తేది ఆదివారం నాడు స్వర్గస్తులైనారు.
వారి పవిత్రఆత్మకు ఆ సాయినాధుడు
శాంతిని కలుగజేయాలని మనసారా కోరుకొంటూ...
అశ్రునయనాలతో...

తల్లి- రేబాల కాంతమ్మ | భార్య - రేబాల పద్మావతి

**కుమారుడు - కోడలు**
రేబాల పవన్‌కుమార్‌రెడ్డి - స్వప్న

**మనుమడు**
సాయిచరణ్

**కుమార్తె - అల్లుడు**
రేబాల కీర్తిచందన - సతీష్‌కుమార్‌రెడ్డి

**మనుమరాలు**
ప్రగతిశ్రీ

ఉత్తరక్రియలు : 27-01-2010 తేది బుధవారం నాడు పెద్దకర్మ
నెల్లూరు, బాలజీనగర్, పుట్టవీధి (డోర్ నెం. 27-1-1107)లోని
మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు,
శ్రేయోభిలాషులకు తెలియజేయడమైనది. ఫోన్ : 0861 - 2334183

## విశిష్ట వ్యక్తిత్వం డాక్టర్ రేబాల సుబ్బరామిరెడ్డి స్వంతం!

మమ్మలందరినీ దు:ఖసాగరంలో ముంచి రాలిపోయిన ధృవతార డాక్టర్ రేబాల సుబ్బరామిరెడ్డి గారు. ప్రకృతిలో భాగం మనమందరం. తప్పనిసరిగా ఏదో ఒక రోజు కాలధర్మం చెందాల్సిందే. పకృతి తన ధర్మం నెరవేర్చిందని ఒప్పుకోవాలి. జాతస్య మరణం ధృవం ఏవ... అన్నట్లు సహజంగా జరిగిన సంఘటనయైన ఆయన మరణం మా హృదయాలకు తగిలిన గాయం. మా తుదిశ్వాస వరకు అది మిమ్మల్ని వెంటాడుతునే వుంటుంది. సుబ్బరామిరెడ్డి తన ఓర్పుతో, నేర్పుతో తన అరుదైన వ్యక్తిత్వంతో అనేక డిగ్రీలను పొంది ఉన్నతవిద్య అభ్యసించిన వ్యక్తి. తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, ధైర్యంతో విజయవంతంగా ముందుకు సాగిన వ్యక్తి. ఆయన చాలాసౌమ్యుడు. మంచిని అనుసరించే తత్వం వున్నవాడు. గొప్ప మానవతావాది, చాలా కష్టపడి వున్నత స్థితికి ఎదిగినా, ఆయన నడవడికలో గానీ వ్యక్తిత్వంలో గానీ సామాన్య జీవితం గడిపే లక్షణంలోగానీ ఎలాంటి మార్పు రాలేదు. ఆయన పిల్లలమైన మేము చదివిన వృత్తివిద్య కోర్సులలో ఆయనకు ఏమాత్రం పరిచయం చొరవ లేకపోయినా మమ్మల్ని ఆ కోర్సులు పూర్తిచేసేందుకు తగిన స్ఫూర్తిని ఆయన అందించారు. జీవితంలోని అన్ని రంగాలలో మాకు మార్గదర్శకత్వం చేశారు. ఇటువంటి దృక్పథం ఈ రోజులల్లోని పిల్లల చాలామంది తల్లిదండ్రులలో అరుదుగా చూస్తు వుంటాము. ఆయన ఒక విభిన్నమైన వ్యక్తి, తానెంచుకొన్న మార్గంలో జీవితం గడపడానికి పలు త్యాగాలు చేసి త్యాగమూర్తి.

ఆయన ఈ లోకం నుంచి నిష్క్రమించి తిరిగిరాని లోకాలకు వెళ్లడం అనేది మాకు ఒక శాపం. అలజడులలో నిశ్శబ్దం అనేది ఏ విధంగా పొందలేమో ఆ విధంగా మేమంతా మూగబోయాం. ఆ మహాత్ముని ఆత్మకు భగవంతుడు చిరశాంతిని కలిగించాలని మనసారా కోరుకొంటున్నాము.

.... కుమారుడు, కుమార్తె, మరియు కుటుంబసభ్యులు

## శ్రీధర్‌కృష్ణారెడ్డిని నిలదీసిన కార్యకర్తలు

### ప్రజారాజ్యం పార్టీ జిల్లాస్థాయి సమీక్షలో రగడ!



నెల్లూరు పద్మావతి కళ్యాణమండపంలో జరిగిన ప్రజారాజ్యం పార్టీ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి.

పార్టీ ఏర్పాటుచేసి ఏడాదిన్నర. కానీ ప్రజారాజ్యం పార్టీలోని క్యాడర్‌లో నిస్తేజం, నిరాశ కొట్టొచ్చినట్లు కనపడ్డాయి. 17వ తేది నెల్లూరు పద్మావతి కళ్యాణ మండపంలో జరిగిన జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలు పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి తాము పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రతినిధుల ముందు ఏకరవు పెట్టారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సుఖసౌఖ్యాలు తప్ప స్వంత పార్టీ కార్యకర్తల గూర్చి పట్టించుకోక పోవడంపై ధుమధుమలాడారు. ఆయన్ను ఎమ్మెల్యే హోదాకు తగ్గట్లు ప్రవర్తించమని పబ్లిక్‌గా సలహా యిచ్చారు. రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డితో చెట్టాపట్టాలు వేసుకొని తిరగాల్సిన అవసరం ఏమొచ్చిందనే సరికి శ్రీధర్‌కృష్ణారెడ్డి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. పరిశీలకుడిగా వచ్చిన డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో మంచి భవిష్యత్తు వుందన్నారు. త్వరలోనే జిల్లాస్థాయి కమిటీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను నియమిస్తామన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించను పార్టీ అధినేత చిరంజీవి త్వరలోనే జిల్లాలో పర్యటిస్తారని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు తనపై రుసరుసలాడడంతో ఎమ్మెల్యే శ్రీధర్ కృష్ణారెడ్డి మనసుకు కష్టం కలిగినట్లుంది. కార్యకర్తల కోసం వారి ఇళ్లకైనా వస్తానుగాని జైళ్లకు, పోలీస్‌స్టేషన్లకు రానన్నారు. నన్ను గెలిపించింది చిరంజీవి అభిమానులే. కానీ విధ్వంసకర కార్యక్రమాల్లో పాల్గొని అండగా నిలవమంటే ఎలాగన్నారు. ఇటీవల జరిగిన రిలయన్స్ షాపింగ్ మాల్ విధ్వంసం సమయంలో అరెస్ట్ చేసిన పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై బహిరంగ చర్చ జరిగింది. ఈ సమావేశంలో ప్రజారాజ్యం పార్టీ నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, పులిమి శైలజ, సుంకర అంజనాద్రి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఈశ్వరమ్మ, ఖాజావలి, రాఘవయ్య, కొణిదెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన 14వ వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పిస్తున్న తెలుగునేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటస్వామినాయుడు తదితరులు.

## స్తంభించిన పాలన



అన్నిటికీ మౌనసాక్షి నెల్లూరు కలెక్టరేట్.

రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభం మూలంగా జిల్లాలోనూ పరిపాలన గత రెండు నెలలుగా స్తంభించిపోయింది. ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల నేపథ్యంలో బంద్‌లు, ప్రదర్శనలు; మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తిగా పరిపాలనాపర వ్యవహారాల్లో జోక్యం తగ్గించుకోవడంతో అధికార యంత్రాంగంలో ఓ రకమైన నిస్తేజం ఆవరించింది. గత రెండు నెలలుగా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావిజ్ఞప్తుల దినం అంతంతమాత్రంగానే జరిగింది. నీటిపారుదల శాఖ, పంచాయితీరాజ్ శాఖ, రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకుగాను కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. జిల్లాస్థాయి అధికారులు కేవలం సమీక్షా సమావేశాలకు పరిమితం కావడంతో మండలస్థాయి అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్, రాజీవ్ యువశక్తి, బిసి కార్పొరేషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మైనార్టీ కార్పొరేషన్ తదితర సంక్షేమ శాఖలు రుణాలు మంజూరు చేయడంలో బాగా వెనుకబడిపోయాయి. బ్యాంకు లింకేజీల ద్వారా పలు పథకాలు అమలు కావాల్సి వున్నా పట్టించుకొనే దిక్కు లేకుండా పోయారు. ప్రభుత్వం వైపు నుంచి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు అందుతున్నాయే తప్ప ఇతర సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోవడం లేదు. బియ్యంతోపాటు నిత్యావసరాలు, కూరగాయలు, ఆర్టీసి ఛార్జీలు పెరగడంతో జనం అల్లాడిపోతున్నారు. మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున పప్పుధాన్యాలు వస్తున్నా వీటి ధరలు నియంత్రించేవారు లేకుండా పోయారు. ఈ వారంలో జరిగే కలెక్టర్ల సమావేశం అనంతరమైనా జిల్లా అధికారుల ప్రవర్తనాశైలి, పాలకుల వైఖరిలో మార్పు కానవస్తుందని ఆకాంక్షిద్దాం.

## 17వ తేదీనే అసలైన పండుగ



చేపల మార్కెట్ దగ్గర సందడే సందడి.

భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు 13, 14, 15 తేదీల్లో వచ్చినా వివిధ కారణాల వల్ల జనం వాటిని ఈయేడాది ఆనందోత్సాహాల మధ్య జరుపుకోలేకపోయారు. ఏ ఆటంకాలు లేకపోవడంతో 17వ తేది ఇష్టమైన తిండి వండుకొని హాయిగా పండుగ వాతావరణాన్ని ప్రస్ఫుటీకరించారు. సంక్రాంతి, కనుమ రోజులను ఘనంగా జరుపుకోవడం రివాజు. ఈసారి ఈ రెండు పండుగలకు సూర్యగ్రహణం అడ్డుగా నిలిచింది. దీంతో దేవాలయాలకు కూడా వెళ్లలేని పరిస్థితి ఎదురయ్యింది. 15వ తేది మధ్యాహ్నం 3.30 గంటల వరకు గ్రహణం వుండడంతో చేపలు, రొయ్యలు, మటన్, చికెన్ 10.30 గంటల ప్రాంతానికి ఊడ్చేసినట్లు అయిపోయాయి. మామూలు రోజుల

### పెద్ద పండుగకు విఘ్నాలు!

డంతోపాటు శుక్రవారం కావడంతో ఆ రోజు 50 శాతం గృహాల్లో కనుమ పండుగ హోరు కానరాలేదు. 16వ తేది శనివారం రావడంతో మాంసాహార ప్రియులు 17వ తేదీ నిజమైన పండుగ చేసుకోవాల్సి వచ్చింది. 17వ తేది ఉదయాన్నే మాంసాహార ప్రియులు నగరంలోని డైకస్‌రోడ్డు, పొదలకూరురోడ్డు, సంతపేట, సర్వేపల్లికాల్వ ప్రాంతాల్లోని చేపలు, మాంసం మార్కెట్లపై పడకన్నా చేపలు, రొయ్యలు అధిక రేట్లు పలికాయి. పచ్చి మామిడికాయ 25 రూపాయలుగా అమ్ముడుపోయి రికార్డు సృష్టించింది. మందు బాబులు సైతం విపరీతంగా తాగడంతో 17వ తేది నెల్లూరు నగరంలో కోటి 75 లక్షల రూపాయల మద్యం అమ్ముడు పోయింది. పండుగంటే తినడం, తాగడమని చెప్పుకొనే రోజులు ప్రస్తుతమున్నాయి. ఎంతైనా కలికాలం... ఏం చేస్తాం!

## ట్రాఫిక్ దిగ్బంధం

### ఎన్నాళ్లీ నరకయాతన

నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి అయ్యప్పగుడి వరకు ఏదో ఒక ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ నిలచిపోయి ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి కట్టినా ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోజుకు పది నుంచి పదిహేను సార్లకు పైగా ట్రాఫిక్ నిలచిపోతుంది. స్టోన్‌హౌస్‌పేటలో మూడేళ్ల క్రిందట రోడ్డు విస్తరణ చేయాలంటూ మార్కింగ్ ఇచ్చినా పనులు చేపట్టలేదు. ఈ ప్రాంతంలోనే ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ట్రాఫిక్ నడక కష్టంగా మారుతుంది. ఇక్కడ పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. కనకమహల్ నుండి గాంధీబొమ్మ వరకు ఇదే పరిస్థితి. వీఆర్‌సి సెంటర్ నుంచి ఏసి సెంటర్ వరకు ట్రాఫిక్ ప్రతినిత్యం పద్మవ్యూహాన్ని తలపింపజేస్తుంది. జడ్పీ ఆఫీసు, స్టేటుబ్యాంక్ ఆఫ్ ఇండియా జంక్షన్‌తోపాటు విజయమహల్ గేటు, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసి బస్టాండ్‌ల వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యే. ట్రాఫిక్ ఐలాండ్లు నగరంలో ట్రాఫిక్ సమస్యను జటిలం చేస్తున్నాయి. గత ఏడాదిగా హరనాథపురం జంక్షన్‌లోనూ తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మాటలు తప్ప చిత్తశుద్ధితో కూడిన ప్రణాళిక ఏ ప్రజాప్రతినిధి, అధికారి వద్ద లేకపోవడం బాధాకరం. నెల్లూరీయులకు ట్రాఫిక్ సమస్య నుంచి పరిష్కారం ఎప్పటికో?



పద్మవ్యూహాన్ని తలపించే ట్రాఫిక్.

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

# నెల్‌కాస్ట్ విద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తున్న జనం!

**ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయితీ పరిధిలో నెల్‌కాస్ట్ నిర్మింపతలపెట్టిన బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని స్థానికులు వద్దని చెబుతున్నా జిల్లా అధికారులు మాత్రం ఏర్పాటు వైపే అడుగులు వేస్తున్నారు.**



పైనాపురం గ్రామంలో నెల్‌కాస్ట్ కంపెనీ థర్మల్ స్టేషన్ నిర్మింపతలపెట్టిన స్థలం.



తుఫాన్ షెల్టర్‌లో నెల్‌కాస్ట్ కంపెనీ ఏర్పాటు చేసిన వైద్యశాల.

జిల్లాలో గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రత్యేక ఆర్థిక మండళ్ళు ఏర్పాటు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో అపాచి బూట్ల తయారీ ఫ్యాక్టరీ, చిల్లకూరు మండలం అంకులపాటూరు వద్ద ఎస్‌టిక్యూ స్టీల్ పరిశ్రమ, ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టు, రిలయన్స్, ఎపిజెన్‌కో ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదే మండలంలోని పైనాపురం సమీపంలో నెల్‌కాస్ట్ ఎనర్జీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కానుంది.

## ఏకపక్షంగా ప్రజాభిప్రాయం!

బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ద్వారా తలెత్తే ఇబ్బందులపై జనవరి 6వ తేదీ పైనాపురం పంచాయితీ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అయితే ఇక్కడ జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఏకపక్షంగా జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురించి ముందుగా సమీప గ్రామాలలో ప్రచారం చేయాల్సి వుండగా అధికారులు ఎందుకో ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారి తీస్తుంది. బొగ్గు ఆధారిత పరిశ్రమను ఏర్పాటు చేసే కంపెనీ ప్రతినిధులు ముందుగానే కొంతమంది నాయకులను తమకు అనుకూలంగా వ్యవహరించేట్లు చేసుకోవడంలో సఫలమయ్యారు.

పరిశ్రమల ద్వారా అభివృద్ధి చెందాలే కాని వినాశనానికి దారి తీయకూడదు. బొగ్గు ఉపయోగించడం ద్వారా తలెత్తే సమస్యల గురించి ప్రభుత్వ పరంగా ప్రజలకు ఎవరూ వివరించలేక పోయారు. కొన్ని ప్రజా సంఘాలు, జనవిజ్ఞాన వేదిక నాయకులు వివరించేందుకు ప్రయత్నించగా వారిని అధికారులు, పోలీసులు అడ్డుకోవడాన్ని బట్టి చూస్తే ఎన్ని ఇబ్బందులెదురైనా కూడా పరిశ్రమను ఏర్పాటు చేయాలన్న తెగింపు అధికారులలో కనిపిస్తుంది. ముందుగా కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసిన 10 మంది చేత అనుకూలంగా మాట్లాడించారు. మిగిలినవారికి అవకాశం ఇవ్వకుండా గంట వ్యవధిలోనే కార్యక్రమం ముగించారు.

## నెల్లూరుకు ముప్పే!

ముత్తుకూరు మండలం పైనాపురం సమీపంలో నెల్‌కాస్ట్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు టి.పి గూడూరు మండలంలోని వరకవిపూడి, శివరామపురం గ్రామాలకు చెందిన భూములు సేకరించారు. 1320 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు జరిగితే సమీప గ్రామాలతోపాటు నెల్లూరు నగరానికి కూడా ముప్పు ఏర్పడే ప్రమాదం వుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో రామగుండం, కొత్తగూడెం, విజయవాడ ప్రాంతాల్లో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తలు గుర్తు చేస్తున్నారు.

బొగ్గును ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాల నుంచి ప్రధానంగా బూడిద వెలువడుతుంటుంది. ఒక్క మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తే మూడు నుంచి నాలుగు టన్నుల బూడిద వస్తుందని నిపుణుల అంచనా. 1320 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తే రోజుకు 3.960 టన్నుల బూడిద వస్తుంది. సంవత్సరానికి 14.45 లక్షల టన్నుల బూడిద విడుదలవుతుంది. విడుదలయ్యే బూడిదను దాదాపు సిమెంటు కర్మాగారాలకు వినియోగించి మిగిలిన బూడిద చెరువులో నిల్వ వుంచుతారు. అయితే పైనాపురం సమీపంలో ఏర్పాటు చేసే బొగ్గు ఆధారిత విద్యుత్ పరిశ్రమ నుంచి విలువడే బూడిదను వినియోగించేందుకు జిల్లాలో ఎన్ని సిమెంటు ఫ్యాక్టరీలున్నాయన్నది కంపెనీ ప్రతినిధులు, అధికారులు చెప్పడం లేదు.

భవిష్యత్‌లో ఏమైనా సిమెంటు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసే అవకాశం వుందా? ఏర్పాటయితే అవి ఎంత బూడిదను వినియోగించుకోగలవు అన్న పూర్తి వివరాలు వెల్లడించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. చెరువులో నింపిన బూడిద గాలిలో కలవకుండా నీటిని వెదజల్లే ఏర్పాట్లు మాత్రం చేస్తామంటున్నారు. ఇది ఎంతవరకు అమలుచేస్తారో చెప్పలేని విషయమే. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద వందల ఎకరాలలో ఏర్పాటు చేసిన బూడిద చెరువులను ప్రతినిత్యం నీటితో తడపడం లేదు. వేసవికాలంలో చెరువుల నుంచి బూడిద ధూళి ఎగిసిపడి పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందికరంగా మారి పలు రకాల "శ్వాసకోశ" వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఆక్సిడేటివ్‌స్ట్రేస్ అనే ధూళి వల్ల గుండెజబ్బులు పెరగడంతోపాటు నరాల బలహీనత, పక్షవాతం వచ్చే అవకాశాలు ఎక్కువగా వుంటాయని, ఇది జీవించే హక్కును కాలరాయడమేనని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే వర్షాకాలంలో బూడిద చెరువు నుంచి పరిసర ప్రాంతంలో వున్న పొలాలపై నీరు ప్రవహించి పంటలకు, పంటపొలాలకు అపారనష్టం సంభవించే ప్రమాదం కూడా వుంటుంది.

## దుమ్మును ఎలా నియంత్రిస్తారు!

ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిఫిలేటర్లు వినియోగించి గాలిలో దుమ్మును నియంత్రిస్తామని అంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ధూళి ఎంత? ప్రాజెక్టు కారణంగా వాతావరణంలో ధూళి ఎంత ప్రమాణంలో ఉండగలదు? ఎంతమేరకైతే మానవులు, ఇతర ప్రాణులు, వృక్షజీవులు తట్టుకోగలవు? అన్న వివరాలేవి ప్రాజెక్టు నివేదికలో పొందుపరచలేదు. అత్యంత ప్రమాదకరమైన సల్ఫర్‌డైఆక్సైడ్‌ను నిర్వీర్యం చేసేందుకు ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్‌ని ఏర్పాటు చేయాల్సి వుంటుంది. దీనిని కూడా ఏర్పాటు చేస్తామని ఎక్కడా చెప్పకపోవడాన్ని బట్టి చూస్తే ప్రజల ఆరోగ్యపట్ల వీరికున్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసే సమీప గ్రామాల ప్రజలకు కాలుష్యపరంగా తలెత్తే సమస్యలు గాని, వ్యాపించే వ్యాధుల గురించి గాని పెద్దగా అవగాహన లేదు. అయితే ప్రజల తరపున మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు భవిష్యత్‌లో తలెత్తే సమస్యలు, ఇబ్బందుల గురించి ప్రస్తావించకుండా మౌనంగా వుండిపోతున్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఒక యూనిట్ ఉత్పత్తికి 2140 కిలో కేలరీల థార్మికశక్తి అవసరం అవుతుంది. ఇందులో 60శాతం వృధాగా మారి పరిసర వాతావరణాన్ని వేడెక్కిస్తుంది. 1320 మెగావాట్ల విద్యుత్‌ప్రాజెక్టు వలన వాతావరణంలో ఉష్ణోగ్రత ఎంత పెరుగుతుందో వూహించలేనిదని నిపుణులు అంటున్నారు.

వాటర్‌బేస్ కంపెనీకి చెందిన 650 ఎకరాల భూమిని నెల్‌కాస్ట్ ఎనర్జీ కార్పొరేషన్ కొనుగోలు చేసి దీనిలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈనెల 26తేదిన భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకొంటున్నారు. పైనాపురం, అనంతపురం, చంద్రశేఖరపురం, వరకవిపూడి గ్రామాల ప్రజలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు గురించి తమకు తెలియదంటున్నారు. గ్రామ సర్పంచ్‌ల దగ్గర నుంచి ఎమ్మెల్యేల స్థాయిలో మాత్రమే ఈ కేంద్రం ఏర్పాటుపై చర్చలు జరిపినట్లు తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను దశలవారీగా తొలగిస్తుంటే పైనాపురంలో ఈ పరిశ్రమ ఏమిటో?

### సమగ్ర నివేదిక ఇవ్వాలి!



ముత్తుకూరు మండలంలో వివిధ సంస్థలు ఏర్పాటు చేస్తున్న బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సంబంధించిన సమగ్ర నివేదికలను రూపొందించి ప్రజల ముందు వుంచాలి. పరిశ్రమల కారణంగా వెలువడే కార్బన్ డై ఆక్సైడ్‌ను నియంత్రించేందుకు రిలయన్స్, జెన్‌కో, నెల్‌కాస్ట్ కంపెనీలు దాదాపు 135కోట్ల మొక్కలను పెంచాల్సి వుంటుంది. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా కలెక్టర్ కేవలం నిమిత్తమాత్రుడిగా వుండిపోవడం మామూలే.

**విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ**

### జీవించే హక్కును కాలరాయడమే!



ముత్తుకూరు మండలంలో ఏర్పాటుచేస్తున్న రిలయన్స్, ఎపిజెన్‌కో, నెల్‌కాస్ట్ బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వలన అనేక రకాల వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ వ్యాధుల వలన మరణాలు కూడా సంభవిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ప్రభుత్వాలు దృష్టిసారిస్తుంటే మనదేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అనుమతులు జారీ చేయడం దురదృష్టకరం.

**ఇ.వెంకటేశ్వర్లు**, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి

# కాసులు పండిస్తున్న ఎర్రమట్టి!

## • వెంకటాచలంలో తెగ త్రవ్వేస్తున్నారు.

గ్రావెల్ అక్రమత్రవ్వకాలు జిల్లాలో జోరందుకొన్నాయి. ఎర్రమట్టి వ్యాపారం కాసులు కురిపిస్తుండడంతో ప్రభుత్వ స్థలం, ప్రైవేటు స్థలం అనే తేడాలేకుండా ఎక్కడపడితే అక్కడ త్రవ్వేస్తున్నారు. ఈ గ్రావెల్ వ్యాపారంతో కోట్ల రూపాయలు లాభం వస్తుండడంతో ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా త్రవ్వకాలు జరుపుతున్నారు. ముఖ్యంగా కృష్ణపట్నం పోర్టు ఏర్పడడం, పరిశ్రమల నిర్మాణాలతో మట్టికి ఎక్కడ లేని గిరాకి ఏర్పడింది. వెంకటాచలం ఇందుకు ప్రధాన కేంద్రమయింది. ఇక్కడ ఎర్రమట్టి వ్యాపారం మాఫియాను తలపిస్తోంది. యధేచ్ఛగా ప్రభుత్వభూముల్లో త్రవ్వకాలు సాగిస్తున్నా రెవెన్యూ అధికారులు, మైనింగ్‌శాఖ మౌనం వహిస్తుండడంతో గ్రావెల్ అక్రమవ్యాపారం 10 ట్రాక్టర్లు, 20 టిప్పర్లుగా సాగిపోతుంది. వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు, సర్వేపల్లి, అనికేపల్లి, రామదాసుకండ్రిగ, ఇప్పపాళెం, గొలగమూడి, ఈదగాలి, జంగాలపల్లి, ఇడిమేపల్లి తదితర గ్రామాలలో అనుమతి లేకుండా ఎర్రమట్టి అక్రమంగా తరలిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ త్రవ్వకాలను అరికట్టాల్సి వుంది.



నెల్లూరు నుంచి తిరుపతికి కొత్తగా ప్రవేశపెట్టిన ఎసి ఆర్టీసి బస్సు శీతల హంసకు జెండా ఊపి పంపుతున్న పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.



బుచ్చిలోని తిరివీధి లక్ష్మీకాంతమ్మ ట్రస్ట్ నేతృత్వంలో పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్పీ మల్లారెడ్డి. ప్రక్కన ట్రస్ట్ నిర్వాహకుడు తిరివీధి రాధాకృష్ణయ్య.



నెల్లూరు టౌన్‌హాల్‌లో అఖిలపక్ష నేతృత్వంలో జరిగిన జ్యోతిబసు సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు జక్కా వెంకయ్య. వేదికపై మోహన్‌రావు, భానురాజు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు.



కలెక్టరేట్‌లో ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రామ్‌గోపాల్. ప్రక్కన జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గార్, అదనపు జాయింట్ కలెక్టర్ సీతారామయ్య.

• పిహెచ్‌సిలకు

## నిర్లక్ష్యపు రోగం!

గ్రామీణ ప్రజలకు వైద్యాన్ని చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, నిర్లక్ష్యపురోగం సోకడంతో ప్రజలకు ఉపయోగపడకుండా మారాయి. జిల్లావ్యాప్తంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలాగే వుంది. వైద్యులు, సిబ్బందికి మధ్య సమన్వయం కొరవడడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక, డాక్టర్లలో చిత్తశుద్ధి లేక ప్రభుత్వ ఉద్దేశం అటకెక్కుతోంది. దీనికి ఉదాహరణ ఓజిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం. 2002

### పని చేయని డాక్టర్లు, సిబ్బంది

సంవత్సరంలో కొలువైన ఈ వైద్యకేంద్రం ప్రజలకు ఎలాంటి వైద్య సౌకర్యాలు అందించలేక దిష్టిబొమ్మలా మారడం విచారకరం. ఈ కేంద్రం ద్వారా షుమారు 10వేల మందికి వైద్యసేవలు అందించాల్సి వుండగా వైద్యులు లేక, వున్నా రాక ప్రజలకు దూరమైంది. పట్టించుకొనేవారు లేక ఆపరేషన్ థియేటర్ మూతపడింది. అందులోని విలువైన పరికరాలు తుప్పుపట్టి పనికిరాకుండాపోయాయి. ఆపరేషన్ థియేటర్ ఏర్పాటైన నాటి నుంచి ఒక్క చిన్న శస్త్రచికిత్స కూడా ఇక్కడ జరగలేదంటే ఎంతగా నిరుపయోగంగా మారిందో, వైద్యులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తుంది.

నిధులు లేక

## నిఘా కొరవడింది!

బడ్జెట్‌లో అటవీశాఖకు తగినంత నిధులు కేటాయించనందునే నిఘా చర్యలు చేపట్టలేకపోతున్నట్లు అటవీశాఖ ప్రిన్సిపల్ ఛీఫ్ కన్సర్వేటర్ సమ్మిరెడ్డి వ్యాఖ్యానించారు. వెంకటగిరి వచ్చిన ఆయన అటవీశాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. అడవుల సంరక్షణ కోసం చేపట్టాల్సిన నిఘా చర్యల కోసం రానున్న ఐదేళ్లలో 1200 కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందుకు కేంద్రప్రభుత్వం అనుమతిచ్చిందని వివరించారు. తొలి విడతగా ఈ ఏడాది 65 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. అటవీశాఖ రేంజ్ స్థాయి అధికారులకు క్రొత్త వాహనాలు, 100 స్ట్రయికింగ్‌ఫోర్స్ బృందాలను అందిస్తున్నట్లు తెలిపారు. స్మగ్లింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలను నియమించామని, క్రిందిస్థాయి సిబ్బందికి సెల్‌ఫోన్ బిల్లులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు సమ్మిరెడ్డి చెప్పారు. ఆయన వెంట అధికారులు రాంప్రసాద్, పవన్‌కుమార్, భాస్కర్‌రావు, గోపాల్ తదితరులు వున్నారు.

## కోడూరు బీచ్‌లో దొంగల భయం!

పర్యాటకం అభివృద్ధి చెందేదెట్లా?

పర్యాటక కేంద్రంగా వున్న కొత్త కోడూరు బీచ్‌లో దొంగతనాలు అధికం కావడంతో పర్యాటకులు హడలిపోతున్నారు. ఈ బీచ్‌కు నెల్లూరు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి సెలవుదినాలు, పండుగ రోజుల్లో అధికసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడకు వచ్చే సందర్శకుల వస్తువులకు భద్రత లేకుండా పోవడం వారిని కలవరపెడుతుంది. గత కొంతకాలంగా సముద్ర తీరానికి వచ్చేవారి విలువైన వస్తుసామగ్రి దొంగతనానికి గురవుతున్నా మండలంలోని పోలీసులు తగిన చర్యలు చేపట్టడంలో విఫలం కావడంతో ఇవి జోరందుకొన్నాయి. ఇటీవల బుచ్చిరెడ్డిపాళానికి చెందిన ఆంజనేయులు కుటుంబం బీచ్ వద్దకు వచ్చి సేద తీరుతుం డగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సెల్‌ఫోన్లు, కెమెరాలు షుమారు 50వేల రూపాయలు విలువచేసే వస్తువులు, నగదును తస్కరించి సైకిళ్లపై పారిపోయారు. ఇంత జరుగుతున్నా సందర్శకుల రక్షణ కోసం పోలీస్ అవుట్‌పోస్టు ప్రత్యేకంగా లేకపోవడం పట్ల ప్రజలు పోలీసుల తీరును తప్పుబడుతున్నారు.

## లీకేజీలతో ఇబ్బంది

ముత్తుకూరు మండలంలోని చెరువులన్నీ నీటితో నిండి కళకళలాడుతున్నా లీకేజీలు రైతులను ఆందోళన కల్గిస్తున్నది. పలు చెరువుల్లో జలకళ వుట్టి పడుతోంది. కృష్ణపట్నం కాలువ, వల్లూరు కాలువలకు నీళ్లు రావడంతో అవి పూర్తిగా నిండి వున్నాయి. ముత్తుకూరు, నేలటూరు, పిడతాపోలూరు, పైనాపురం తదితర ప్రాంతాల్లో గల చెరువులన్నింటికి నీరు వచ్చి చేరింది. ఈ చెరువుల క్రింద షుమారు ఎనిమిదివేల ఎకరాల ఆయకట్టు వుంది. ఇంతగా చెరువుల్లో, కాలువల్లో నీరువున్నా తూములు, కలుజులు దెబ్బతినడంతో వీటి ద్వారా నీరు వృధాకావడం వారి ఆందోళనకు కారణం. కాలువలు పూడికతో నిండి వుండడంతో సాగునీరు పారడంలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని నీటి వృధాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



సూర్యగ్రహణం సందర్భంగా మూతబడ్డ నెల్లూరు రంగడి ఆలయం.

# సాగుతున్న దక్షిణ కాల్వ పనులు

సోమశిల దక్షిణ కాలువ పరిధిలోని కలువాయి, చేజర్ల, పొదలకూరు మండలాల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన పనులు ఐదేళ్లు గడిచినా పూర్తికాకపోవడం అధికారుల వైఫల్యాన్ని తెలియజేస్తున్నది. ఈ కాలువ పనుల కోసం ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా 95వ ప్యాకేజి క్రింద రూ.28.81 కోట్లను 2005 సంవత్సరంలో మంజూరు చేసింది. పనులను చేపట్టిన నిర్మాణ సంస్థ ఐదేళ్లు గడిచినా వాటిని పూర్తి చేయలేదు. దక్షిణ కాలువలో 11.4కి.మీ నుంచి 74.72కి.మీ వరకు 13కిలోమీటర్ల మేర అక్కడక్కడ లైనింగ్ పనులు చేయాలి. 58.72కి.మీ వద్ద 400 మీటర్ల పొడవున అక్విడెక్టు నిర్మించాలి. 70.5కి.మీ వద్ద సూపర్ ప్యాసేజ్ నిర్మించాలి. మొత్తం పొదలకూరు మండలంలో 1911 ఎకరాల ఆయకట్టును వృద్ధి చేయాల్సివుండగా పనులు నత్తనడకన సాగుతూనే వున్నాయి.

**ప్రారంభమయ్యి ఐదేళ్లు!**

## బాలికల హాస్టల్‌లో సమస్యల తిష్ట

### పొదలకూరులో పరిస్థితిది

పొదలకూరులోని బిసి బాలికల వసతి గృహం సమస్యల నిలయంగా మారడంతో ఇక్కడి విద్యార్థినులు పలు అవస్థలు పడుతున్నారు. ఈ హాస్టల్‌లో మూడవతరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే బాలికలు 137 మంది వరకు వున్నారు. వీరితోపాటు ఇంటర్, డిగ్రీ చదివేవారు మరో 36 మంది వున్నారు. మొత్తం 173 మంది విద్యార్థులు వుంటున్న హాస్టల్‌లో కనీససౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థినుల సంఖ్యకు సరిపడే గదులు లేకపోవడంతో ఆరు గదుల్లోనే హాస్టల్ విద్యార్థినులంతా వుండాల్సిరావడంతో నిద్రించాలంటే బాలికలకు తిప్పలు తప్పడం లేదు. వంటగదిలో నిద్రించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. మరుగుదొడ్ల పరిస్థితి అంతంత మాత్రంగా వుండడంతో బాలికల పరిస్థితి దయనీయంగా వుంది. త్రాగునీటి సౌకర్యం లేకపోవడంతో హైస్కూలు వద్ద వున్న కొళాయి నుంచి మంచినీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇక భోజనం సరేసరి. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మెను అమలు కావడం లేదు. ఇంతగా హాస్టల్ విద్యార్థినులు సమస్యలతో సతమతం అవుతున్నా సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది.

## పంటను పాడు చేస్తున్న పందులు

ముత్తుకూరు మండలంలో పైర్లకు తెగుళ్లు సోకి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటిని ఎలా నివారించాలి, పంట దిగుబడి ఎలా సాధించాలి అని రైతులు ఒకవైపు తీవ్రంగా ఆలోచన చేస్తుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు పందులు నిద్రలేకుండా చేస్తున్నాయి. పందులు గుంపులు గుంపులుగా వచ్చి వెన్నుదశలో వున్న పైరును చిందర వందర చేస్తుండడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అడవిపందుల నుంచి పంటలను కాపాడుకోవడం రైతులకు తలకుమించిన భారం అవుతున్నది. కృష్ణపట్నం ఫారెస్టు నుంచి వచ్చే పందులు రాత్రి సమయాల్లో పంటలను నాశనం చేస్తుండడం రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నది.

# వణికిస్తున్న డెంగ్యూ జ్వరం!

### జిల్లా అంతటా వ్యాపించింది

జిల్లాలోని పలు మండలాల్లో డెంగ్యూవ్యాధి ప్రజలను వణికిస్తోంది. పలువురు దీని బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నా పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో డెంగ్యూవ్యాధికి గురయ్యేవారి సంఖ్య రోజురోజుకు అధికమవుతోంది. సంగం మండలంలో పలు గ్రామాలలో డెంగ్యూ ప్రబలి వుంది. చికున్‌గున్యా, వైరల్ జ్వరాలతో సతమతం అవుతున్న గ్రామాల ప్రజలు డెంగ్యూ బారినపడి ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారు. మండల కేంద్రంలోని తిరుమనతిప్ప కాలనీకి చెందిన చేనేత కార్మికులు 30మంది డెంగ్యూ, చికున్‌గున్యాల బారినపడ్డారు. మసీదువీధికి చెందిన ఖాజాబీ అనే మహిళ డెంగ్యూతో మృతి చెందింది. వరుసపెట్టి ప్రజలు రోగాలకు గురౌతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఏటా నిధులు మంజూరు అవుతున్నా ఎక్కడా వాటి జాడే కన్పడడం లేదు. డెంగ్యూ, చికున్‌గున్యా కేసులు నమోదైనచోట తూతూ మంత్రంగా బ్లీచింగ్ చల్లి వైద్యఆరోగ్య సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకొంటున్నారు.

## పోలీసులపై మందుబాబుల దౌర్జన్యం!

మద్యం మత్తులో వీరంగం చేస్తున్న వారిని ప్రశ్నించినందుకు ఏకంగా పోలీసులపైనే దౌర్జన్యం చేసిన ఘటన వెంకటగిరిలో జరిగింది. ఆదివారం కొందరు యువకులు తప్పతాగి త్రిభువని థియేటర్ సమీపంలో రాత్రివేళ గొడవ చేస్తూ వచ్చే పోయే వారిని ఇబ్బంది పెడుతుండగా గస్తీ పోలీసులు

**వెంకటగిరిలో విచిత్రం**

వారిని మందలించి పొమ్మని చెప్పారు. దీనికి ఆగ్రహించినవారు పోలీసులపైనే దౌర్జన్యానికి దిగి చేయిచేసుకోవడం కలకలం రేపింది. దీంతో పోలీసులు మనోజ్, వెంకటేశ్వర్లు, రమేష్, నాగభూషణం, వెంకి అనే వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.



# ఘనంగా వెంకయ్య నాయుడు షష్టిపూర్తి వేడుకలు!







జాతీయస్థాయిలో నెల్లూరు కీర్తిప్రతిష్టలు ఇనుమడించే విధంగా రాజకీయాలలో రాణిస్తున్న వెంకయ్యనాయుడు తన అరవయ్యవ జన్మదినోత్సవాన్ని తాను ఎంతగానో ఇష్టపడే వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రాజకీయ, సినీరంగానికి చెందిన ప్రముఖులు, సన్నిహితుల మధ్య జరుపుకొన్నారు. షష్ట్యబ్ది ఉత్సవాలతో ట్రస్టు ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. స్వగ్రామానికి చెందినవారి నుంచి ఢిల్లీస్థాయి నేతల వరకు వారు వీరు అనే తేడా లేకుండా హాజరై వెంకయ్య వక్తిత్వాన్ని, రాజకీయాలలో ఆయన నిబద్ధతను కొనియాడారు. ఆత్మీయ సమావేశం పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు అరుణ్‌జైట్లీ, అనంతకుమార్, కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప, హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణ తదితరులు ముఖ్యఅతిథులుగా విచ్చేసి వెంకయ్య నాయుడుతో తమకు గల అనుబంధాన్ని, సాంగత్యాన్ని గుర్తు చేసుకొన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన వెంకయ్య ప్రధాని పీఠం అధిరోహించాలని జైట్లీ ఆకాంక్షించారు. దక్షిణాదిలో తిరుగులేని నాయకుడు వెంకయ్య అని చెప్పిన అనంతకుమార్ ఆయన్ను సౌత్ ఇండియా కింగ్ అని అభివర్ణించారు. ఎంత ఎదిగినా ఒదిగి వుండేతత్వం అందరికీ ఆదర్శమని, గ్రామాల అభివృద్ధికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా నాయుడు చేసిన కృషి అమోఘమని కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప ప్రశంసించారు. పార్టీ కష్టకాలంలో వున్నప్పుడు ఎంతగానో తోడ్పాటు అందించారన్నారు. షష్టిపూర్తి కార్యక్రమానికి విచ్చేసిన ఆత్మీయులను ఉద్దేశించి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రధాని కావాలన్న కోరిక లేదన్నారు. భవిష్యత్తులో ఎన్నికలలో పోటీచేయనని, ఓట్లు అడగనని, కుటుంబసభ్యులు కూడా పోటీలో వుండరని తేల్చి చెప్పారు. విలువలతో కూడిన రాజకీయాలు మృగ్యం అవుతున్నాయని ఆవేదన చెందారు. ప్రజలకు సేవ చేయడమే తన అజెండానని స్పష్టం చేశారు. కార్యక్రమానంతరం ప్రఖ్యాత గాయని సునీత, శ్రీకృష్ణలు నిర్వహించిన సంగీత కార్యక్రమం అదనపు హంగును సమకూర్చి పెట్టింది. కర్నాటక మంత్రులు ఆశోక్, సుబ్రహ్మణ్యం నాయుడుతోపాటు ఎమ్పీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కనుమూరి బాపిరాజు, ఎర్రబల్లి దయాకర్‌రావు, కోడెల శివప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి, సి.రామచంద్రయ్య, పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సినీ హీరో సాయికుమార్ తదితరులు ఈ వేడుకలకు హాజరైనారు.

**తరలి వచ్చిన నేతలు, స్నేహితులు, హితులు!**







## జలయజ్ఞానికి నిధుల గండం



జలయజ్ఞానికి నిధుల గండం పట్టుకుంది. వైఎస్ సిఎంగా వున్నప్పుడు జలయజ్ఞానికి నిధుల వరద పారేది. ప్రస్తుతం ఖజానా ఖాళీ కావడంతో జలయజ్ఞం అర్ధాంతరంగా నిలిచి పోయింది. ఇప్పటిదాకా జలయజ్ఞానికి 70వేల కోట్ల రూపాయల్ని వెచ్చించారు. ఫలితంగా కొన్ని ప్రాజెక్టుల పనులు కొంతవరకు పూర్తయ్యాయి. ప్రస్తుతం వేలకోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. వీటిని చెల్లించినా కూడా మరో లక్షా 20వేల కోట్ల రూపాయలదాకా నిధులు అవసరమవుతాయని నీటిపారుదలశాఖ అంచనా వేసింది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి పెండింగ్ బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొని వుంది. జలయజ్ఞానికి వెంటనే తగిన మొత్తంలో నిధులు కేటాయించకపోతే తాము ప్రాజెక్టుల నిర్మాణం నుంచి తప్పుకోవాల్సి వస్తుందని గుత్తేదారులు ప్రభుత్వానికి అల్టిమేటం కూడా ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుబోక నీటిపారుదలశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



## పదవుల ఎర

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల్ని బలహీనం చేసేందుకు రోశయ్య 'ప్రభుత్వ పదవుల్ని ' ఎరగా వేయాలని నిర్ణయించాడు. ఇందులో భాగంగానే త్వరలో మంత్రి వర్గాన్ని విస్తరించే కార్యక్రమంలో వున్నాడు. దీనికితోడు ఖాళీగా వున్న వివిధ కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీల పాలక వర్గాల పోస్టులకు తెరఎత్తాలని నిర్ణయించాడు. తనకు సన్నిహితుడైన ఎన్.శివరామసుబ్రహ్మణ్యంను కీలకమైన ఎపిఐఐసి ఛైర్మన్‌గా నియమించాడు. త్వరలో మరికొన్ని కార్పొరేషన్లను కూడా భర్తీ చేయబోతున్నాడు. పదవుల్లేక అసంతృప్తిగా వున్నవారి జాబితాను ఇప్పటికే సిద్ధం చేసుకున్నాడు. ఇందులో ప్రస్తుత ఎమ్మెల్యేలతోపాటు మాజీలు, గత ఎన్నికల్లో ఓడినవారు కూడా వున్నారట. పదవుల పందేరం ప్రారంభమైతే అసంతృప్తి కొంతవరకైనా తగ్గుతుందన్నది రోశయ్య చిరు ఆశ. చూద్దాం! ఏం జరుగుతుందో...!

## బడ్జెట్‌కు సంపంగి నూనె




మింగమెతుకు లేదుకానీ... మీసాలకు సంపంగి నూనె అన్నట్లుంది రాష్ట్ర ప్రభుత్వ తీరు. రాబడి తగ్గి బొక్కసం ఖాళీ అయిన నేపథ్యంలో కూడా వచ్చే యేడాది బడ్జెట్‌ను లక్షకోట్ల రూపాయలకు దాటించాలని ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో నెలకొన్న అస్థిర పరిస్థితులు, బంద్‌ల కారణంగా ఆదాయం బాగా తగ్గిపోయి ఖజానా నిండుకుంది. రాష్ట్రంలో వ్యవసాయం, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ పరిస్థితులు కూడా నిరాశాజనకంగా వున్నాయి. ఈ స్థితిలో కొత్తగా ఆదాయం వచ్చే మార్గాలు లేవు. దీంతో వార్షిక బడ్జెట్ కేటాయింపుల్ని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మలుచుకోవాల్సి వుండగా రాష్ట్ర ప్రభుత్వ మాత్రం ప్రతిష్టకు పోతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల్ని కేంద్ర ప్రణాళికా సంఘం తిప్పి పంపింది. ప్రతిపాదనల్ని సహేతుకంగా తేవల్సిందిగా ప్రణాళికా సంఘం కోరింది. దీంతో ఆర్థిక శాఖాధికారులు అంకెలతో కుస్తీ పడుతున్నారు.

## పాపం ప్రజారాజ్యం



ప్రజారాజ్యం పార్టీ పరిస్థితి అట్టర్‌ఫ్లాప్ సినిమాలా వుంది. సమైక్యాంధ్రకు జైకొట్టిన దగ్గర నుండి ప్రజారాజ్యం తెలంగాణలో అడ్రస్ లేకుండాపోయింది. తెలంగాణ ప్రాంతంలోని ప్రజారాజ్యం పార్టీ ఆఫీసులకు తాళాలు పడ్డాయి. ఇక హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయం వద్ద కూడా సందడి లేదు. పార్టీ అధ్యక్షుడు చిరంజీవి వచ్చినా కూడా పార్టీ కార్యాలయంలో కార్యకర్తల హడావుడి వుండటం లేదు. ఇక పార్టీలోని కీలక పదవుల్లో వున్నవారంతా ఒక్కొక్కరుగా రాజీనామాల బాట పట్టడంతో రాష్ట్ర కార్యవర్గం దాదాపు ఖాళీ అయ్యింది. 'చిరు' సోదరులు పవన్‌కళ్యాణ్, నాగబాబు, బావమరిది అల్లు అరవింద్ కూడా పార్టీ కార్యాలయం వైపుకు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఆ పార్టీకి చెందిన తెలంగాణ ఎమ్మెల్యేలు ఇద్దరు కూడా 'చిరు'తో తెగతెంపులు చేసుకున్నారు. 'చిరు' ఒంటరితనాన్ని చూసినవారంతా పాపం 'చిరు' అంటూ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.

## జైలులో వడ్డీ వ్యాపారం



నెల్లూరు సెంట్రల్ జైలులో పలు సంఘ వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయని లోకం కోడైకూసినా జైలు అధికారులు అన్ని వ్యవహారాలను తమ కర్కశ పదఘట్టనల క్రింద నలిపేస్తుంటారు. కాని గతవారం ఓ జైలు వార్డన్ రైలు పట్టాలపై శవమై కనిపించి జైలులో జరుగుతున్న లోగుట్టు వడ్డీ వ్యాపారం లోకానికి వెల్లడయ్యేలా చేశారు. జైలులో వున్న ఖైదీలకు వార్డన్లు నూటికి పదిరూపాయల లెక్కన డబ్బు వడ్డీకిస్తారట. వడ్డీ అసలు ఖైదీల ఇళ్లకు వెళ్లి వసూలు చేస్తారు. ఈ పని నుంచి తిరిగి వస్తూ ప్రమాదవశాత్తు జైలు వార్డన్ రైలు పట్టాలపై శవమయ్యాడు. కాని జైలు అధికారులు ఈ వ్యవహారాన్ని సైతం మసిపూసి మారేడుకాయచేసే ప్రయత్నాల్లో వున్నారు.

## వెంకయ్యే... డైలాగ్ కింగ్!



గాంభీర్యమైన గొంతుతో పలువురు హీరోలకు డబ్బింగ్ చెప్పి 'డైలాగ్ కింగ్'గా పేరు గాంచిన నటుడు సాయి కుమార్. గతవారం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన భారతీయ జనతా పార్టీ నాయకుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు షష్ఠిపూర్తి వేడుకలకు సాయికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశాడు. ఈ సందర్భంగా నాయుడు గారు సాయికుమార్‌ను మర్యాదపూర్వకంగా సన్మానించారు. సన్మానానికి సాయికుమార్ కృతజ్ఞతలను చెల్లిస్తూ అందరూ నన్ను డైలాగ్‌కింగ్ అంటారు. అయితే వెంకయ్యనాయుడు గారే నన్ను మించిన డైలాగ్ కింగ్. వ్రాసిచ్చిన డైలాగులు నేను చదువుతాను. అనర్గళంగా డైలాగులు నాయుడు గారు చెబుతారని అసలు విషయాన్ని నైసుగా చెప్పాడాయన.

## పూజకు నోచని పుష్పాలు



పుష్పవిలాపం వ్రాసిన కరుణశ్రీ ఒప్పుకోక పోవచ్చు గాని ప్రకృతిలో పుష్పించిన ప్రతి పుష్పం పూజకు నోచుకోవాలని కోరుకొంటుంది. కాని ఈ మాఘమాసంలో నెల్లూరులోని పూల వ్యాపారులు పూల రేట్లు విపరీతంగా పెంచేశారు. కిలో పదిరూపాయలకు దొరికే బంతిపూలు 25, కారపు బంతి 35, చామంతి 50 రూపాయలుగా అమ్మారు. గులాబీలు, కాగడాలు, లిల్లీలకు ఎక్కడలేని ధర అంటకట్టారు. మల్లెలైతే బంగారాన్ని తలపించాయి. పండుగ నెలలో,చివరికి వందుగపూట కూడా ఈ రేట్లకు పూలుకొని ప్రజలు దేవదేవుళ్లను పూజించలేకపోయారు. ఇంతులు ప్రియమారా తమ సిగల్లో తురగలేకపోయారు. ఈ వ్యవహారాన్ని మనం సరికొత్త 'పుష్పవిలాపం' అందామా?

## అప్పుడే వ్యతిరేకత రాదు సుమీ!



నెల్లూరు సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి తోకని టాక్ ఆఫ్ ది టౌన్. 17వ తేది ఉదయం జరిగిన ప్రజారాజ్యం పార్టీ జిల్లా సమావేశ వివరాలను సాయంత్రం సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో బంపర్ డ్రాకు వచ్చిన శ్రీధర్‌కృష్ణారెడ్డిని వివేకానందరెడ్డి అడిగారు. ఆయన సమాధానం చెప్పకమునుపే అప్పుడే నీ మీద వ్యతిరేకత రాదులే శ్రీధరంటూ భరోసా యిచ్చినట్లు మాట్లాడారు. సమావేశంలో తనను కార్యకర్తలు నానా మాటలన్న కాకమీద శ్రీధర్‌కృష్ణారెడ్డి నవ్వలేక... అట్లని ఏడ్వలేక పెట్టిన ఫీలింగ్‌కు అక్కడ నుంచి వివేకా లేచి వెళ్లడం భలే 'పంచ్'గా చెప్పుకోవాల్సిందే!

## వీరేం చేస్తారు!



కాంగ్రెస్‌పార్టీ ఎంతో చరిత్ర వున్న పార్టీ. దానిలో చిత్రవిచిత్రాలు చోటు చేసుకొంటుంటాయి. అటువంటిదే తమిళనాడులో కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల నిర్వాహకులుగా వెళ్లిన నెల్లూరు యువకాంగ్రెస్ నాయకుల వ్యవహారం. రాజీవ్‌భవన్ నిర్వాహకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని దిండిగల్‌కు, కేంద్రమంత్రి పనబాక లక్ష్మి అనుంగు అనుచరుడు హరిబాబుయాదవ్‌ను తిరువన్నామలైకు పరిశీలకులుగా వేశారు. అక్కడి కార్యకర్తలతో మాట్లాడను వీరికి తమిళం రాదు. ఇంకేమి ఎన్నికలు నిర్వహించి వస్తారో చూడాలన్న కుతూహలాన్ని వీరి ప్రత్యర్థి వర్గాలు చూపుతున్నాయి.



శ్రీ పెద్దిరెడ్డి శంకరరెడ్డి గారు

జననం : 13-01-1925 మరణం : 16-01-2010

# ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, నిరంతరం మా హృదయాలలో వెలిగే జ్యోతి
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్ములను తన
గుండెలలో దాచుకొన్న ప్రేమమయుడు

**శ్రీ పెద్దిరెడ్డి శంకరరెడ్డి గారు**

(సాయి బాబా సైకిల్ మార్ట్, సాయి తేజ లాడ్జి)

16-01-2010 శనివారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : పెద్దిరెడ్డి మహాలక్ష్మమ్మ

కుమారులు - కోడళ్లు

పెద్దిరెడ్డి శ్యామమోహన్‌రెడ్డి - శ్రీవల్లి
డా॥ పెద్దిరెడ్డి రవికుమార్‌రెడ్డి(USA) - డా॥ పద్మశిరీష

కుమార్తెలు - అల్లుళ్లు

M. సులోచనమ్మ - కీ॥శే॥ M. గోపాలరెడ్డి (Rtd., Supdt., T.T.D)
K. నిర్మలమ్మ - డా॥ K. సత్యనారాయణరెడ్డి (కొమిట్ల బస్ సర్వీస్)
M. రజని - డా॥ M. సుబ్రమణ్యంరెడ్డి, E.N.T స్పెషలిస్ట్

మరియు మనుమలు -మనుమరాళ్లు

పెద్దకర్మ : తేది 28-01-2010 గురువారం నెల్లూరు, విజయమహల్ థియేటర్ (రాజీవ్‌భవన్) ఎదురుగా గల మా స్వగృహము నందు జరుగును.

బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఇందుకూరుపేట బిట్-1లో పారిశుధ్యం అధ్వాన్నం!

ఇందుకూరుపేట బిట్-1 గ్రామ పంచాయితీలో పారిశుధ్య పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయి. చెత్తను ప్రతిరోజు తొలగించకపోవడం వలన ఎక్కడ చెత్త అక్కడే పేరుకపోయి వుంది. అలాగే డ్రైనేజి కాల్వలు ఏర్పాటు చేయకపోవడం వలన మురికినీరంతా వీధులలో చేరి దుర్వాసన వెదజల్లుతున్నది. ఒకప్పుడు సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా వున్న ఇందుకూరుపేటను అభివృద్ధి చేయకపోవడంతో కుగ్రామాన్ని తలపించే విధంగా తయారయ్యింది. గ్రామ పంచాయితీ పాలకవర్గం, అధికార యంత్రాంగం ఇక్కడ అభివృద్ధిపై దృష్టిసారించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకూరుపేట బిట్-1 గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా తాటిపర్తి గీత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 14వార్డులున్న ఈ పంచాయితీలో 2వేల కుటుంబాలు, 10వేలకు పైగా జనాభా, 5వేల మంది ఓటర్లున్నారు. ఈ గ్రామ పంచాయితీ పరిధిలో గొల్లపాళెం, పోతురాజుదిబ్బ, ఉప్పరపాలెం, చెల్లయ్యతోపు, గమళ్లపాళెం తదితర గ్రామాలు వున్నాయి. గతంలో సర్వేపల్లి నియోజకవర్గంలో వున్న ఇందుకూరుపేట మండలాన్ని నియోజకవర్గాల పునర్విభజనలో కోవూరు అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనం చేశారు. మూడు సంవత్సరాల క్రితం మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాలు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయి అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

ఎస్సీ, ఎస్టీ కాలనీలలో వీధులను చదును చేయకుండానే నాయకుల స్వార్థం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సిమెంటు రోడ్లు నిర్మించడం జరిగింది. కొద్దిపాటి వర్షం వచ్చినా కూడా సిమెంటురోడ్లపై వర్షపునీరు నిల్వ వుంటుంది. ఒక వీధిలో సిమెంటురోడ్డు వేసి మరో వీధిలో సిమెంటు రోడ్డు వేయక పోవడం కారణంగా నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇదిలా వుండగా ఇందుకూరుపేట దళితవాడల్లో మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో ముఖ్యంగా మహిళలు బహిర్భూమికి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు చెప్పారు. కాలనీల చుట్టూ పంట పొలాలు వుండడంతో దోమల బెడద అధికంగా వుంటుందన్నారు. పారిశుధ్యం మెరుగు పరిచేందుకు, దోమల నివారణకు పంచాయితీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వున్నాయి. పంచాయితీకి రెగ్యులర్ కార్య దర్శిని నియమించకపోవడం వలన ఇన్‌చార్జ్‌గా వేరే పంచాయితీకి చెందిన కార్యదర్శికి బాధ్యతలు అప్పగించడంతో ఆయన అందుబాటులో వుండడం లేదు. ఈ నేపథ్యంలో పంచాయితీలోని సమస్యలు, జరిగిన అభివృద్ధి పనులపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.



**అభివృద్ధికి కృషి చేస్తున్నాం!**

పంచాయితీ అభివృద్ధికి పాలకవర్గం ఎంతగానో కృషిచేస్తోంది. పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నాం. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఫాగింగ్ చేయిస్తున్నాం. కొంతమంది లబ్దిదారులు గృహాలను నిర్మించుకునేందుకు ఆసక్తి చూపకపోవడంతో పూర్తికాకుండా పోయాయి.

– ఎన్.శ్రీనివాసులు, ఉపసర్పంచ్



**మరుగుదొడ్లు నిర్మించాలి!**

దళిత కాలనీల్లో మరుగుదొడ్లు నిర్మించకపోవడం వల్ల బహిర్భూమికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా మహిళలు పడుతున్న అవస్థలు చెప్పనలివి కావు. గతంలో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు అధికారులు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వాటి గురించి పట్టించుకున్న నాధుడే లేకుండాపోయాడు.

– కె.ఆదెయ్య



మురికి కాలువ పక్కనే త్రాగునీటి కొళాయి.



అసంపూర్తిగా ఇందిరమ్మ ఇళ్లు.

అవినీతి కథ

# వాణిజ్య పన్నులశాఖలో చెప్పలేనంత అవినీతి!




నెల్లూరులోని వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం.

జిల్లాలో వ్యాపారస్తుల నుంచి సక్రమంగా పన్నులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చాల్సిన వాణిజ్య పన్నులశాఖ అధికారులు తమ స్వంత ఆదాయాన్ని పెంచుకొనే పనిలో నిమగ్నమైపోయారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చే శాఖలలో వాణిజ్య పన్నులశాఖ ఒకటి. అయితే ఈ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వ్యాపార సంస్థలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. ప్రభుత్వ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి నెల్లూరు నగరంలో వాణిజ్య పన్నులశాఖ డివిజినల్ కార్యాలయం ఏర్పాటుచేశారు. పై రెండు జిల్లాల్లో సిబ్బంది పని తీరును డిప్యూటి కమిషనర్ పర్యవేక్షిస్తుంటాడు. వివిధ రాష్ట్రాల నుంచి నెల్లూరు నగరానికి రవాణా అవుతున్న సరుకులకు పన్నులు చెల్లించారా లేదా అని నిత్యం తనిఖీలు చేయడం వీరి విధి. ఇతర రాష్ట్రాల నుంచి పన్నులు చెల్లించకుండానే పలు సరుకులు ప్రతిరోజు దిగుమతి అవుతున్నాయి. అలాగే జిల్లా నుంచి తమిళనాడు రాష్ట్రానికి బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటుంది.

వ్యాపారసంస్థలు ప్రభుత్వానికి ఏ విధంగా పన్నులు చెల్లించకుండా తప్పించుకోవాలన్న విషయాన్ని ఈ శాఖాధికారులే వివరిస్తుంటారు. వ్యాపారసంస్థలను తనిఖీలు చేయడం పూర్తిగా మానుకొన్నారు. దీపావళి, సంక్రాంతి తదితర పండుగల సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వివిధ రకాల వస్తువులు జిల్లాకు దిగుమతి అవుతుంటాయి. ఈశాఖ అధికారులు ప్రతి నెల మామూళ్లు తీసుకొంటూ పన్నుల వసూళ్లు, తనిఖీలు చేయడం లేదు. ఇంతేకాకుండా కొంతమంది దళారులను నియమించుకొని నెలసరి మామూళ్లు చెల్లించని వ్యాపార సంస్థలపై మాత్రం తనిఖీల పేరుతో దాడులు చేస్తుంటారు.

పన్నుల వసూళ్లతోపాటు ఎవరైనా వ్యాపారం ప్రారంభించేందుకు అనుమతి కూడా జారీ చేస్తుంటారు. వ్యాపార దుకాణం ప్రారంభించేవారు వాణిజ్య పన్నులశాఖకు దరఖాస్తును చేస్తారు. స్వీకరించిన దరఖాస్తు పరిశీలించిన అనంతరం ఫీజు వసూలు చేసి రిజిస్ట్రేషన్ చేయాల్సి వుంటుంది. అయితే ఇక్కడ క్రింది స్థాయి అటెండర్ నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు అవినీతి సొమ్ముకు బాగా అలవాటుపడినవారే. దరఖాస్తు స్వీకరించిన నాటి నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికేటు జారీ చేసే వరకు ప్రతి సెక్షన్ సిబ్బంది జలగల్లా పీడిస్తారు. అధికారులు అడిగిన మొత్తం చెల్లించకుంటే వివిధ రకాల కారణాలు చూపి తిప్పుకోవడం లేదా తిరస్కరించడం చేస్తుంటారు.

దీంతో వ్యాపారుల ఎందుకొచ్చిన ఇబ్బంది అని భావించి అడిగిన నగదును చేతుల్లో పెడుతుంటారు. ఇదిలా వుండగా ఆదివారాలు, సెలవుదినాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపార సంస్థలు మూసివేయాలి. ఇక్కడ కూడా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుంటారు. దుకాణాలు తెరచి వ్యాపారం చేస్తున్నా పట్టించుకోరు. ఈ శాఖకు చెందిన అధికారులకు నెలసరి మామూళ్లు లక్షల్లో అందుతుంటాయన్ని సమాచారం. ఈ శాఖలో పనిచేసే అధికారులు అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ శాఖ అధికారుల పనితీరుపై ఇతర శాఖల అధికారులు పర్యవేక్షణ చేసే అధికారం లేకపోవడం వలన అడ్డూ, అదుపు లేకుండా పోయింది.

పెద్ద పెద్ద వ్యాపార సంస్థల నుంచి ఈ శాఖాధికారులు ఇంటి అవసరాలకు కావలసిన సరుకులు, బట్టలు ఇతర వస్తువులు ఉచితంగా చేరుతుంటాయి. ఇందుకు వ్యాపార సంస్థల ప్రతినిధులే పూర్తిగా సహకరించడం విశేషం. వాణిజ్య పన్నుల శాఖవైపే అవినీతి నిరోధక శాఖాధికారులు దృష్టి పెట్టకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.



# అదరగొట్టని 'అదుర్స్'

అల్లూరు రహీం

విడుదలకు ముందు తెలంగాణ జాగ్రుతి సంస్థ నాయకురాలు కవిత మూలంగా వార్తలలో ముఖ్యాంశంగా నిలిచిన 'అదుర్స్' చిత్రం విడుదలయ్యాక అంతగా ప్రేక్షకాదరణ పొందలేకపోయింది. హీరో ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన నిర్మాత వల్లభనేని నాని వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని తీశారు. వి.వి. వినాయక్ దర్శకత్వం వహించిన 'అదుర్స్'లో అదరగొట్టే అంశాలేవీ లేవు. గత చిత్రాలకంటే భిన్నంగా ఎన్టీఆర్ గొప్పగా నటించలేదు... నర్తించనూ లేదు. వాస్తవం చెప్పాలంటే ఈ చిత్రం పూర్తిగా బ్రహ్మానందం కామెడీ, అందాల భామలు నయనతార, షీలా దేహప్రదర్శనపైనే ఆధారపడిపోయింది. అదుర్స్‌లో అగ్రవర్ణం బ్రాహ్మణులను తక్కువ చేసేవిధంగా కొన్ని డైలాగులున్నాయి. ముస్లిం సోదరులకు పరమపవిత్రమైన 'అస్సలామలేకుం' పదాన్ని ఒక పాటలో ప్రారంభ చరణంగా దర్శకుడు వాడాడు. కాని ఆ తర్వాత హీరోయిన్ల అంగాంగ ప్రదర్శన, వర్ణనకు పూనుకోవడం పెద్ద సాహసమే. పిల్లా నావల్ల కాదు చరణంతో సాగే పాటను 14ఏళ్ల లోపు పిల్లలు చూడకూడదని ఒకటికి రెండుసార్లు వెండితెరపై చూపేలా చేసిన సెన్సార్ అధికారులు బ్రాహ్మణులను తక్కువ చేసేలా వున్న మాటలను, అస్సలామలేకుం పాటను ఏవిధంగా ప్రదర్శనకు అనుమతించారో అర్థమే కావడం లేదు. బోడిగుండుకు మోకాలికి ముడివేసినట్లు బ్రహ్మానందం-నయనతారను ప్రేమించడం, ఆమె ఎన్టీఆర్ వెంటబడుతుందని తెలిసి అతను విలన్‌గా మారడం వంటి సన్నివేశాలు పెద్దగా పండలేదు. అదే విధంగా బ్రహ్మానందం పిలకతో సహా పబ్‌కు పెళ్లి బీర్ కొట్టడం, చేపలు బాగుంటాయని చెప్పడం సబబుగా లేదు. హీరోయిన్ నయనతార ఎన్టీఆర్ పిర్రలను గిల్లడం, నువ్వుమూసుకో... నేను మూసుకొంటానంటూ చేపల మార్కెట్‌లోని భాష మాట్లాడడం కుటుంబసభ్యులతో సహా చిత్రానికి వెళ్లిన వారు ఇబ్బందులు పడక తప్పదు. హద్దుదాటిన సన్నివేశాలను, మాటలను కోన వెంకట్ వంటి విలక్షణ కథా, మాటల రచయిత వ్రాయడం సహేతకంగా లేదు. చంద్రకళ... చంద్రకళ చరణంతో సాగే పాట మాత్రం అటు సాహిత్యపరంగా దృశ్యపరంగా బాగుంది. సంగీతం సమకూర్చిన దేవీశ్రీప్రసాద్ ఈ చిత్రంలో వెస్టర్న్ బీట్స్ వైపే మొగ్గు చూపాడు. ఛోటా కె.నాయుడు కెమెరా విన్యాసాన్ని మెచ్చుకోకుండా వుండలేం. అన్ని సన్నివేశాల్లో అద్భుత చిత్రీకరణతో వన్నెలద్దాడు.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే మిలటరీ మేజర్ చంద్రశేఖర్(నాజర్) భార్య కవల పిల్లలను ప్రసవిస్తుంది. ఈ సమయంలోనే ఆసుపత్రిలో కాన్పుకు చేరే తనికెళ్ల భరణి భార్య రాజ్యలక్ష్మి కడుపున పుట్టిన బిడ్డ చనిపోతాడు. ఆసుపత్రిలో పనిచేసే నర్సు ఓ బిడ్డను తనికెళ్ల భరణి తల్లికి ఇచ్చేసి చనిపోయిన రాజ్యలక్ష్మి బిడ్డను అక్కడ పెట్టేస్తుంది. దీంతో నరసింహాచారి (ఎన్టీఆర్) బ్రాహ్మణ అగ్రహారంలో, మరొకడు నరసింహం (ఎన్టీఆర్) తల్లి దగ్గరే పెరుగుతారు. నరసింహాచారి జీన్స్ ప్రభావం మూలంగా నాన్‌వెజ్ తినేవారిలా వ్యవహరిస్తుండగా తనికెళ్ల భరణి తల్లి అతడ్ని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తుంది. పెద్దవాడైన తర్వాత నరసింహాచారి, భట్టు (బ్రహ్మానందం) దగ్గర పౌరోహిత్యానికి చేరితే నరసింహ పోలీస్ కమిషనర్ (సాయాజిషిండే) వద్ద ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తుంటాడు. భట్టు పెళ్లివయసు దాటినవాడైనా చంద్రకళ(నయనతార)పై మోజు పెంచుకొంటాడు. చంద్రకళ మాత్రం నరసింహాచారిని ఇష్టపడుతుంది. అక్కడేమో పోలీస్‌కమిషనర్ కుమార్తె నందు (షీలా) నరసింహను ప్రేమిస్తుంది. నరసింహ మూలంగా తుడుచుకపెట్టుకపోయిన నయీమ్, పాండు, ముకుల్‌దేవ్‌ల గ్యాంగ్‌లు అతనిపై కసి పెంచుకొంటారు. ఈ సమయంలోనే కలకత్తా నుంచి వచ్చిన ధనరాజ్ (అశిష్ విద్యార్థి) నరసింహను కిడ్నాప్ చేస్తాడు. అండర్ వరల్డ్ డాన్ బాబాజీ(మహేష్ మంజ్రేకర్) ముందు ప్రవేశ పెడతాడు. అతను ఓ విధ్వంసకరమైన ఆయుధ తయారీ కోసం మేజర్ చంద్రశేఖర్‌ను బంధించి వుంటాడు. అతను తన కుటుంబసభ్యులతో మాట్లాడాకే ఈ ఆయుధం పని చేసే విధానం తెలుపుతాననడంతో కుమారుడు నరసింహను ఆయన ముందు ప్రవేశపెడతారు. ఇక్కడ నుంచి కథ సాదాసీదాగా నడుస్తుంది. నరసింహ బాబాజీ డెన్ నుంచి తప్పించుకొంటాడు. చారి అక్కడ చేరుతాడు. నాటకీయ పరిణామాల మధ్య అన్నదమ్ములు కలుసుకొని విలన్ భరతం పట్టి తమ ప్రియురాళ్లను అక్కున చేర్చుకోవడంతో చిత్రం ముగుస్తుంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌లో పెద్దగా చురుకుదనం కన్పించలేదు. నయనతార అదే తరహాలో కనిపిస్తుంది. బ్రహ్మానందం తన పాత్ర వరకు బేషుగ్గా పోషించాడు. మిగతావాళ్ల గూర్చి చెప్పుకోటనిలేదు. అదుర్స్ చిత్రాన్ని, బెదుర్స్‌లా చేసిన ఘనత దర్శకుడు వినాయక్‌దేననవచ్చు.

## ప్రేమ పుట్టలేదు!



తెర మీద పెద్ద ప్రేమికురాలిగా పేరుపొందిన మగధీర ఫేం హీరోయిన్ కాజల్ ఇంకా తనలో ప్రేమ పుట్టలేదంటుంది. ఈ విషయమై మాట్లాడుతూ ప్రేమ పుట్టాలంటే ముందు మనిషితో పరిచయం కావాలి. అది స్నేహంగా మారాలి. ఆ తర్వాత ఒకరిని గూర్చి ఒకరు పూర్తిగా తెలుసుకోవాలి. అభిరుచులు, అనుపానులు తెలుసుకున్నాకే కదా లవ్‌యూ అని చెప్పగలుగుతాం? అయినా నేను ప్రేమించాలంటే ఆ అబ్బాయికి మానసిక అందం ముఖ్యం. నా కన్నా ఎత్తుగా వుండాలి. ఎప్పుడూ నన్ను నవ్విస్తూ వుండాలి. మా అమ్మా నాన్నలను మించిన ప్రేమ అతడు పంచుతాడన్న నమ్మకం కుదరాలంటుంది కాజల్.

## బికినీ వేయను!



ఒంటరి, హీరో, మహాత్మ చిత్రాల్లో హీరోయిన్ భావన ప్రస్తుతం తమిళచిత్రం 'అసల్'లో అజిత్ సరసన నటిస్తుంది. షూటింగ్‌గ్యాప్‌లో మాట్లాడుతూ మంచి పాత్రలు వస్తేనే పోషిస్తాను. పుష్కరం తర్వాత తిరిగి చూసుకొన్నా అలాంటి పాత్ర ఎందుకు పోషించానా అనిపించకూడదు. నేను బికినీ వేసుకొంటే ఎవరూ చూడలేరు. ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం కూడా లేదు. వల్గర్‌గానో, సెక్సీగానో నేనెప్పుడూ నటించను. నాగూర్చి మంచి చెడు నాకు బాగా తెలుసు. ఒక్కమాట చెప్పాలంటే నేను సెక్సీ కేటగిరీలోకి రాను. తెలుగు పరిశ్రమ పద్ధతిగా నడుచుకొనే పరిశ్రమ. ఇక్కడ తనకెటువంటి ఇబ్బందులు లేవంది.

## నో అంటున్న ఐశ్వర్య!



విశ్వసుందరి ఐశ్వర్య ఈయేడాది రెండు చిత్రాల్లో తళుక్కు మనబోతూంది. దీనిలో శంకర్ 'రోబో', మణిరత్నం 'రావణ్' చిత్రాలున్నాయి. ఈ చిత్రాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఐశ్వర్య, హృతిక్‌రోషన్ హీరోగా నిర్మితమయ్యే గుజారిస్‌లో నటించను ఒప్పుకొంది. ఈ చిత్రానికి సంజయ్‌లీలా భన్సాలీ దర్శకుడు. ఈ సినిమా తర్వాత తన చిత్రంలో నటించమని ఫర్హాన్ అక్తర్ కోరితే సున్నితంగా కాదందట. బెన్‌కింగ్స్‌లే తాజ్‌మహల్ నేపథ్యంలో తీయాలనుకొన్న 'ముంతాజ్‌మహల్' సినిమా నుంచి తప్పుకొంది. ఐష్ కుటుంబ బాధ్యతలు చేపట్టనే సినిమాలు తగ్గించుకొంటోందని, అమ్మదనంలోని కమ్మదనాన్ని ఆస్వాదించేందుకు ఇష్టపడుతోందని ముంబాయి సినీవర్గాల కథనం.

## హన్సిక వింత అలవాటు



గ్లామర్‌తో తెలుగు, తమిళ ప్రేక్షకులను ఆకట్టుకొన్న హీరోయిన్ హన్సికకు ఓ వింత అలవాటుంది. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ నాకు, అభిమానులకు మధ్య వారధి కెమెరా. అందుకే నాకు కెమెరా అంటే ఎనలేని గౌరవం. ఎంతటి నటినైనా సెట్‌లో చేసే ప్రతి అభినయాన్ని ఒడిసిపట్టేది కెమెరానే కదా? అందుకే సెట్‌లో అడుగుపెట్టగానే కెమెరాకు నమస్కరిస్తాను. సాయంత్రం షూటింగ్ పూర్తవగానే మళ్లీ నమస్కారం చేసుకొని వెళ్తాను. మొదట్లో చాలామంది వింతగా చూసేవారు. కాని నేనెవరినీ పట్టించుకోకుండా మనసు చెప్పినట్లే చేస్తున్నానంది ఈ చిన్నది.

## రొయ్యల బిర్యాని అభిమాని!



రకరకాల సైజుల కోసం ఎంత కడుపు మాడ్చుకున్నా జిహ్వా చాపల్యం ముందు మనసు లొంగి పోతుందంటుంది నయనతార. నాకు రొయ్యల బిర్యాని అంటే ఇష్టం. చేపలు, పీతలు, రొయ్యలంటే ప్రాణం. రొయ్యల బిర్యాని అన్ని బిర్యానిలలో పసందుగా వుంటుంది. ఎంత డైటింగ్ చేస్తున్నా రొయ్యల బిర్యాని కంటపడితే కడుపులో పడి అరిగిపోవాల్సిందే నంటుంది ఈ అందాల భామ.

# ఆర్టీసీలో ఇంటి దొంగలు



ఆర్ఎం కార్యాలయం ప్రేక్షకసాత్ర.

ఆసియా ఖండంలోనే అతిపెద్ద రవాణా సంస్థ అయిన ఆర్టీసిలో అవినీతి, అక్రమాలు పెచ్చుపెరిగాయి. సంస్థ నష్టాల్లో వుందని చార్జీలు పెంచిన అధికారులు సంస్థలో అంతర్గతంగా జరుగుతున్న అవినీతి కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నారు. దీనికి ఉదాహరణ నెల్లూరు ఆర్టీసి రీజియన్‌ను పేర్కొనవచ్చు. కాకుటూరులోని ఆర్టీసి స్క్రాప్‌యార్డులో వుండే బస్సులకు సంబంధించిన అల్యూమినియం షీట్లు మాయమయ్యాయి. లక్షలు విలువచేసే వీటి వ్యవహారమై వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో చిన్న కేసు పెట్టి ఆర్టీసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. సూళ్లూరుపేట ఆర్టీసి డిపోలో సిబ్బంది బాక్సుల నుంచి టిక్కెట్లు మాయమయ్యాయి. ఈ విషయాన్ని కూడా ఆర్టీసి అధికారులు బయటకు పొక్కనీయకుండా చేశారు. నెల్లూరు కేంద్రంగా నడిచే రీజియన్‌లో లెక్కలేనన్ని అవకతవకలు జరుగుతున్నాయి. ఆర్టీసి డిపోల్లో సిబ్బంది కొరత వేధిస్తుంది. పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త వారిని నియమించడం లేదు. ఇన్‌ఛార్జీల పాలనలో రకరకాల అవినీతి అక్రమాలు జరిగిపోతున్నాయి. ఆర్టీసిలో ముందు ఇంటి దొంగల పని పట్టాల్సిన బాధ్యత ఉన్నతాధికారులకు లేదంటారా?

# ఎన్నాళ్లీ నిర్లక్ష్యం!



నగరంలో ఇలా దెబ్బతిన్న రోడ్లు ఎన్నో?

నెల్లూరు కార్పొరేషన్ అయ్యి దరిదాపులు ఐదేళ్లు కావస్తుంది. కానీ పాలన మాత్రం నానాటికీ తీసికట్టు నాగంభట్టు తరహాలో సాగుతుంది. నగరంలో పారిశుధ్య పరిస్థితులు బాగా క్షీణించాయి. జనం రకరకాల వ్యాధులతో సతమతమౌతున్నారు. పరిస్థితులు మెరుగుపర్చమంటే నిధులు లేవనే నిర్లక్ష్యపు సమాధానం వస్తుంది. నగరంలోని 90 శాతం ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదు. మెయిన్‌రోడ్లు మినహా అడ్డరోడ్లు నెలకోసారి కూడా శుభ్రం చేయరు. నగరంలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సంవత్సరానికోసారి పారిశుధ్య పనులు చేపడుతున్నారంటే పరిస్థితులు ఎంతగా దిగజారి పోయాయో అర్థం చేసుకోవచ్చు. కొళాయిల్లో ఏ ప్రాంతంలోనూ అర గంటకు మించి నీళ్లు రావు. 24 గంటల నీటి సరఫరా వాగ్దానం ఎప్పటికి అమలు పరుస్తారో? పలు ప్రాంతాల్లో కలుషిత నీటిని కొళాయిల్లో కార్పొరేషనే సరఫరాచేసి జనాన్ని వ్యాధిగ్రస్తులను చేస్తుంది. రోడ్లు నాగరికతకు చిహ్నాలంటారు. నెల్లూరు నగరంలోని సందు గొందుల్లోని రోడ్లు చూస్తే పురాతన నగరాలు గుర్తుకు వస్తాయి. కార్పొరేషన్ ఏమాత్రం దయచూపక జనం వద్ద అన్ని రకాల పన్నులను వసూలు చేస్తుంది. కానీ వీటికి ఆడిటింగ్ లేదు. నెలనెలా ఆడిటింగ్ చేస్తేగానీ కార్పొరేషన్ గాడిన పడదు.

● ధూమ్‌ధామ్‌గా

# సిఎంఆర్ బంపర్ డ్రా!



బంపర్ డ్రా తీస్తున్న నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి.

నెల్లూరీయుల మనసుదోచిన చందన, సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో క్రిస్మస్, జనవరి1, సంక్రాంతి పండుగల సందర్భంగా వస్త్ర కొనుగోళ్లు చేసిన వారిలో విజేతను ఎంపిక చేయడం కోసం 17వ తేది బంపర్ డ్రాను ధూమ్‌ధామ్‌గా నిర్వహించారు. బంపర్ డ్రా విజేతకు చెవర్లెట్ స్పార్క్ కారు బహుమతిగా ప్రకటించారు. చందన బ్రదర్స్ షోరూమ్స్ అధినేత చందన మోహన్‌రావు ఈ బంపర్ డ్రాను పురస్కరించుకొని ప్రత్యేకంగా నెల్లూరు వచ్చారు. నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి, మేయర్ భానుశ్రీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎమ్పీ రాజమోహన్‌రెడ్డి బంపర్ డ్రా విజేతను తన చేతులమీదుగా లాటరీ తీసి పేరు ప్రకటించారు. నెల్లూరుకు చెందిన దీప్తి చెవర్లెట్ స్పార్క్ కారును గెల్చుకొన్నారు. కానీ కూపన్‌లో వున్న ఆమె ఫోను నెంబర్‌కు ఎమ్పీ ఫోనుచేసిన సమయంలో ఆమె స్విచ్ ఆఫ్ చేసి వుండింది. వీక్లీ డ్రాలలో విజేతలు మురళీకృష్ణకు హీరోహోండా, సోమశేఖర్‌రెడ్డికి రిఫ్రిజిరేటర్, డాక్టర్ ప్రభాకర్‌కు టివి, డైలీ డ్రాలో విజేతలు 42 మందికి బంగారు చెవిదిద్దులను ముఖ్య అతిథులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చందన బ్రదర్స్ సిఎంఆర్ అంటే నమ్మకానికి, మన్నికకు మారుపేరన్నారు. చందన మోహన్‌రావు రాష్ట్రంలో 42 బ్రాంచిలు ఏర్పాటు చేయడం ఆయన దీక్షాదక్షతలకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోవూరు పెంచలయ్య, ప్రత్తి రవీంద్రబాబు, ముంగమూరు గోపి తదితరులు పాల్గొన్నారు.

# పగలు కుట్టే దోమ ప్రాణం తీస్తుంది!



ఈ దోమ సామాన్యురాలు కాదు.

నెల్లూరు నగరంలో పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కుడుతూ జనాన్ని రోగగ్రస్తులను చేస్తున్నాయి. దోమలు కుట్టడం వల్లే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతోపాటు ఫైలేరియా వంటి వ్యాధులొస్తాయి. మూడు నెలలుగా నెల్లూరీయులను పగటిపూట 'ఎడిస్ ఈజిప్టీ' అనే శాస్త్రీయనామం గల దోమ తెగ కుట్టేస్తుంది. ఈ దోమను నాటు భాషలో టైగర్ దోమ అంటారు. విచిత్రమేమిటంటే ఈ దోమ శరీరంపై బంగారు రంగు మచ్చలుంటాయి. మనిషి మీద వాలాక కుట్టకుండా వదలి పెట్టని పరమ జిద్దు దోమగా దీన్ని చెప్పుకోవాలి. దీనిమూలంగా 420 మందికి డెంగ్యూ జ్వరం రాగా 36 మందికి పైగా చనిపోయారు. విచిత్రమేమిటంటే ఈ దోమ పగలు పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల మధ్య కుడుతుంది. పారిశుధ్య పరిస్థితులు సరి లేకపోవడం వల్లే నగరంలో ఈ దోమ విజృంభిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు.



స్వర్గీయ గడి వెంకటసుబ్బారెడ్డి గారు

మరణం 17-1-2010

## శ్రద్ధాంజలి

ప్రేమ, ఆప్యాయతానురాగాలతోపాటు మంచితనం మూర్తీభవించిన మా ఇంటి దైవం

**శ్రీ గడి వెంకటసుబ్బారెడ్డి గారు** తేది 17-1-2010 నాడు స్వర్గస్తులైనారు.

వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

| కుమారులు - కోడళ్లు | భార్య |
|---|---|
| గడి మస్తాన్‌రెడ్డి - సౌజన్య | గడి సీతారామమ్మ |
| డా॥ గడి రామచంద్రారెడ్డి - ధరణిజ | మరియు కుటుంబసభ్యులు |

27-1-2010 తేది బుధవారం ఉ. 11 గంటలకు గడి వెంకటసుబ్బారెడ్డి గారికి "శ్రద్ధాంజలి కార్యక్రమము" నెల్లూరులోని సింధూర నర్సింగ్ హోమ్ నందు జరుగును.

కావున బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు తెలుపుచున్నాము.

## జడిపిస్తున్న జెఎసి

మొదటి పేజీ కొరవ

పరిస్థితి వస్తుందేమో, తమ తమ రాజకీయ జీవితాలకు చరమగీతం పాడాల్సి వస్తుందేమో అని భయపడి చస్తున్నారు కాంగ్రెస్, టిడిపి నేతలు. పేరుకు జెఎసి అనే తప్ప నడిపేది మొత్తం కెసిఆర్ మాత్రమే కావడం గమనార్హం. జెఎసి కన్వీనర్ కోదండరాం ఆయన స్వంత మనిషి. కొన్ని కీలక సందర్భాలలో తతిమా పార్టీలో మనోభావాలను పక్కనపెట్టి కెసిఆర్ మనసులోని ఆలోచనలను ప్రకటనలుగా విడుదల చేస్తున్నాడు కోదండరాం. అడ్డుకోవడం ఎవరికీ చేతకావడం లేదు.

జెఎసి అంటే, రాజకీయ పార్టీల సమాహారంగా వుండాలి. కానీ దానికి రాజకీయ జెఎసి అని పేరు మార్చి పలురకాల ప్రజా సంఘాలను కలిపివేశారు. తాడూ బొంగరం లేని సంస్థలు, మావోయిస్టు నేపథ్యం కల్గిన వ్యక్తులు, ఆవేశం తప్ప ఆలోచన లేనివారు కూడా అందులో చేరిపోయారు. రాజకీయ పార్టీలకు వుండే నియమాలు, హద్దులు, భయాలు, నిగ్రహం వారికి వుండకపోవడం సహజం. జెఎసి సమావేశాలలో కాంగ్రెస్, టిడిపిల వంటి ప్రధాన పార్టీల అభిప్రాయాల కంటే ఈ వ్యక్తుల భావాలకే ప్రాధాన్యత లభిస్తున్నది. దానితో జెఎసి నిర్ణయాలు దారి తప్పి పోతున్నాయి. ఉద్యమాన్ని అరాచక మార్గానికి మళ్లిస్తున్నాయి.

మరొకప్రక్క లెక్కలేనన్ని జెఎసిలు పుట్టుకొస్తున్నాయి. టీచర్లు, ఉద్యోగులు, దళిత సంఘాలు, ఆటో డ్రైవర్లు, ఏ విశ్వవిద్యాలయానికి ఆ విశ్వవిద్యాలయం విద్యార్థులు, కుల సంఘాలు ఇట్లా ఎవరికి తోచిన జెఎసి వారు పెట్టుకొంటున్నారు. ఎవరికి నచ్చిన కార్యక్రమాలు వారు కొనసాగిస్తున్నారు. ఉద్యమం మీద ఎవరికీ పట్టులేదు. అదుపు లేదు. నియంత్రణ లేదు. నిర్దిష్ట విధానం లేదు. అంతా గందరగోళం, అరాచకమయం.

ఈ పరిస్థితి ఎక్కడకు దారి తీస్తుందో ఎవరికీ అర్థం కావడం లేదు. అటు కాంగ్రెస్, ఇటు టిడిపి నేతలు కూడా మధనపడుతున్నారు. తప్పు దారిలో నడుస్తున్నామని బాధపడుతున్నారు. కానీ చేయగల్గింది ఏదీ లేదు. చెయ్యి దాటి పోతున్నది.

### దండకాల దాదాగిరి

ఇది చాలదన్నట్లు వివిధ జెఎసిల పేరుతో వ్యాపారులను పీడించి, బెదరించి, భయపెట్టి దాదాగిరి చేసి నిధులు దండుకోవడం మొదలయ్యింది. రోడ్డు పక్కన చిన్నపాటి డాబా పెట్టుకొన్నవారి నుంచి బడాబడా పారిశ్రామికుల వరకు ఎవరినీ వదలడం లేదు. తాము అడిగినంత మొత్తం ఇవ్వవల్సిందే అని బలవంత పెడుతున్నారు. కాదంటే, బంద్ సమయంలో ఆ సంస్థలపై దాడులు చేస్తున్నారు. ధ్వంసం చేస్తున్నారు. ఒక్క విద్యార్థి సంఘాల జెఎసి నేతలే ఈ నెల రోజులలో 7కోట్ల రూపాయల వరకు దండుకొన్నారని పోలీసుల సమాచారం. చందన, బొమ్మన, కళానిధి, కళానికేతన్, జెసి బ్రదర్స్, ఆర్ఎస్ బ్రదర్స్ వంటి ప్రఖ్యాత వస్త్ర దుకాణాల వారు ఈసారి సంక్రాంతి, నూతన సంవత్సరం సందర్భంగా డిస్కౌంట్ సేల్ పెట్టలేదు. అందుకు కారణం ఈ జెఎసిల దౌర్జన్యమే అని వినికిడి. హైదరాబాద్ శివార్లలో వున్న రిసార్ట్‌ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. అర్ధరాత్రి అపరాత్రి ఏదో ఒక జెఎసి పేరిట లోపలకు దౌర్జన్యంగా ప్రవేశించడం, తిన్నంత తిని డబ్బులు ఎగ్గొట్టి పోవడం ఆనవాయితీ అయిపోయింది. వారికి కాదంటే దాడులు తప్పవన్న భయం.

ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ మొత్తంలో అరాచక పోకడ తాండవిస్తున్నది. ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. ఏమీ చేయలేకపోతున్నది. ఇదే పరిస్థితి మరికొన్ని వారాలు నడిస్తే హైదరాబాద్ నగరంలో ఎవరూ వ్యాపారులు చేయలేరు, పరిశ్రమలు నడపలేరు.

---

## పాలన మట్టిపాలే!

16వ పేజీ కొరవ

పట్టడం లేదు. రాష్ట్రంలో డబ్బు లేకుంటే కేంద్రానికి వెళ్లి తెస్తామన్న ప్రయత్నం లేదు. ఏ ప్రపంచ బ్యాంకునో పట్టుకొని తెచ్చుకోవాలన్న ఆలోచన లేదు.

పార్టీ పరంగా కూడా కార్యకర్తలకు ఉత్సాహం కల్గించే కనీస ప్రయత్నం లేదు. నామినేటెడ్ పదవుల పంపకం తన స్వంత మనుషులకు, అదీ తన కులానికి చెందిన వారికి మాత్రమే పరిమితం చేస్తున్నారు. మూడు నియామకాలిస్తే మూడు ఒకే కులానికి చెందిన వారికి దక్కాయి. కార్యకర్తలలో ఇది తీవ్ర నిరసనకు దారి తీస్తున్నది. కానీ లెక్క చేయడం లేదు.

కాంగ్రెస్ చరిత్రలో ఏ ముఖ్యమంత్రికి ఇవ్వనంత నైతిక, రాజకీయ మద్దతు రోశయ్యకు ఇస్తున్నది అధిష్టానం. చిదంబరం, సోనియాగాంధీ కూడా ఆయన బరువు మొత్తం మోయడానికి సిద్ధంగా వున్నారు. అంత సమర్థన దొరికినప్పుడు ఏ ముఖ్యమంత్రి అయినా గట్టిగా నిలదొక్కుకొని పార్టీని, ప్రభుత్వాన్ని తన అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నం చేయాలి. కానీ అటువంటి వూసే లేదు.

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద నడుస్తుందని సామెత. రోశయ్య గారు మెత్తన మాత్రమే కాదు, నిమిత్తమాత్రంగా వ్యవహారం చేస్తున్నారు. పరిపాలనకు అంత కంటే చేటు వేరే ఏదీ అవసరం లేదు. ఆయనలో మార్పు రాకుంటే రాష్ట్రం అధోగతి పాలు కావడం ఖాయం. కాదంటే ఆయన్నే మార్చాలి. అది ఇప్పట్లో జరిగే పని కాదు. మారిస్తే ఎవరనే ప్రశ్నకు ఎవరి దగ్గరా సమాధానం లేదు.

---

## జనవాణి

2వ పేజీ కొరవ

దారుపేటలోని గిరిజన సంక్షేమ భవనం మిద్దెపైన ఒక రూము కేటాయించి అందులో వుంచారు. ఈ మధ్య ఆ భవనాన్ని వ్యాపార సంస్థలకు అద్దెకిచ్చారు. ఆ తర్వాత స్వాతంత్ర్య సమరయోధుల ఫోటోలు ఏమైనాయో తెలియదు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం వుంది.

*టి.కోటేశ్వరరావు, కోవూరు.*

### బిల్ కలెక్టర్లు ఏం పాపం చేశారు?

తెలంగాణ వచ్చేవరకు కరెంట్ బిల్లులు కట్టం అంటూ విద్యుత్ బకాయిలు వసూలు చేయడానికి వచ్చిన బిల్లు కలెక్టర్లను స్తంభానికి కట్టడం, కార్యాలయాల్లో బంధించడం, వారితో నాయకులు ఫోటోలు తీయించుకోవడం సబబా? విద్యుక్తధర్మ నిర్వహణలో వున్న ప్రభుత్వ ఉద్యోగులను నిర్బంధించడాన్ని ప్రభుత్వం అతి తీవ్రమైన నేరంగా పరిగణించి చర్యలు తీసుకోదా?

*ప్రొఫెసర్ నాగరాజరావు, హైదరాబాద్.*

---

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

### కనువిందు చేసిన సూర్యగ్రహణం

15వ తేది ఏర్పడ్డ సూర్యగ్రహణం నెల్లూరీయులను కనువిందు చేసింది. ఉదయం 11.40 గంటల నుంచి మధ్యాహ్నం 3.20 వరకు గ్రహణం కొనసాగడంతో పలువురు జనవిజ్ఞానవేదిక పంచిన అద్దాలతో వీక్షించి ఆనందపరవశులయ్యారు. గ్రహణం సమయంలో మూఢనమ్మకాలను పటాపంచలు చేయను జన విజ్ఞానవేదిక ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద వీక్షకులకు టిఫిన్ పెట్టింది. ఓ గర్భవతిని సైతం ఈ శిబిరానికి తీసుకొచ్చి ఆమెకు గ్రహణాన్ని చూపింది. నగరంలోని రంగనాయకుల స్వామి, రాజరాజేశ్వరమ్మ, మూలస్థానేశ్వరస్వామి ఆలయాలతోపాటు సాయిబాబా మందిరాలను ఉదయం నుంచి మూసి తిరిగి సాయంత్రం 5.30 గంటల తర్వాత తెరిచారు.

### తిరుపతికి నెల్లూరు నుంచి ఎసి బస్సు!

తిరుపతి వెంకన్న దర్శనానికి వెళ్లాలనుకొనే వారు ఒళ్లు అలసిపోకుండా ఇక ఎసి బస్సుల్లో ఎక్కవచ్చు. నెల్లూరు – తిరుపతి మధ్య రోజుకు పన్నెండు ట్రిప్పులు నడిచే ఎసి బస్సులను(శీతల హంస) పురపాలక మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సంక్రాంతి పండుగ రోజు ప్రారంభించారు. 42 సీట్లు వుండే ఈ బస్సులో ఛార్జి 112 రూపాయలు. ఎయిర్ సస్పెన్షన్ల వల్ల కుదుపులుండవు. ఎన్నో ప్రత్యేకతలున్న ఈ బస్సులో ఓసారి తిరుపతి వెళ్లి వస్తే బాగుంటుందేమో!

### శ్రీధర్‌రెడ్డి స్వీట్లకు దామోదర్‌రెడ్డి స్పందన!

తెలంగాణా, సీమాంధ్ర ప్రాంతీయుల మధ్య గొడవలు పెరిగేటట్లు మాట్లాడుతున్న తెలంగాణా ప్రాంత నేతలకు నెల్లూరు రాజీవ్‌భవన్ నిర్వాహకుల్లో ఒకడైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొరియర్‌లో పంపిన ఆంధ్రా పిండివంటలు అందుకొన్న సూర్యాపేట ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి శ్రీధర్‌రెడ్డికి సంక్రాంతి రోజు ఫోను చేశారు. పిండి వంటలు పంపినందుకు కృతజ్ఞతలు చెప్పారు. ఒకవేళ రాష్ట్రం విడిపోయినా అన్నదమ్ముల అనుబంధాన్ని కొనసాగిద్దామన్నారట. తెరాస నేతలకు కూడా పిండి వంటలందినట్లు కొరియర్ సర్వీసు నుంచి ఓచర్లు అందాయే తప్ప శ్రీధర్‌కు వాళ్ల నుంచి ఫోన్లు మాత్రం రాలేదు.

### అలరించిన పద్యనాటక పోటీలు

పెళ్లూరు పట్టాభిరామిరెడ్డి స్మృత్యంకంగా నెల్లూరు టౌన్‌హాల్‌లో నిర్వహించిన పద్యనాటక పోటీలు ప్రేక్షకులను అలరించాయి. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ నాటక పోటీలకు పలు ప్రాంతాల కళాకారులు తరలివచ్చారు. నెల్లూరులోని శ్రీ లక్ష్మీ నరసింహ నాట్యమండలి ప్రదర్శించిన శ్రీరామ సుగ్రీవ మైత్రి నాటకం ఆద్యంతం అలరించింది. కాకినాడ పి అండ్ టి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన రుక్మిణీ సందేశం నాటకం, ఒంగోలు శ్రీకళా ప్రకాశం సంస్థ ప్రదర్శించిన పుత్రాదిచ్ఛేత్ నాటకం జనాభిమానం పొందాయి. విజేతలకు ప్రముఖ రంగస్థల కళాకారుడు పొన్నాల రామసుబ్బారెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి బహుమతులు అందించారు.

### నష్టాల్లో విజయడైరీ!

నెల్లూరు జిల్లాలో సహకార సంస్థల్లో ప్రతిష్టాకర సంస్థ విజయ డైరీ పీకల్లోతు నష్టాల్లో కూరకపోయింది. ఏడు కోట్ల మేర డైరీ నష్టాల్లో వున్నట్లు కొత్తగా ఛైర్మన్ కుర్చీలో కూర్చొన్న చిల్లకూరు సుధీర్‌రెడ్డి గుర్తించారు. 2007లో డైరీ ఆరు కోట్ల రూపాయల లాభాలు ఆర్జించగా ఇంతలో ఈ నష్టాలేమిటన్న శోధనలో పడ్డాడు సుధీర్‌రెడ్డి.

### జాతీయస్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలు

జాతీయస్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలు 20వ తేది ఎసిస్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు ఇవి జరుగుతాయి. 385 టీములు పాల్గొనే ఈ పోటీల కోసం ఎసి స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో ఉడన్ ఫ్లోరింగ్, ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లను చేశారు. క్రీడాకారులకు సౌకర్యంగా వుండేందుకు హవామ్యాట్లు ఆట జరిగేచోట వేశారు. ఈ మ్యాట్ ఒక్కొక్కటి 11 లక్షల రూపాయల విలువ చేస్తుంది. ఇక్కడ ఆడే క్రీడాకారులకు వ్యక్తిగత ర్యాంకింగ్‌తోపాటు ఇంటర్నేషనల్ పోటీలకు సెలక్ట్ చేస్తారు. దివంగత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కోలగట్ల వెంకటరమణారెడ్డి స్మృత్యంకంగా జరుగుతున్న ఈ పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి, ప్రజారాజ్యం పార్టీ నాయకుడు ముక్కాల ద్వారకానాధ్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్నారు.

### పెద్దిరెడ్డి శంకరరెడ్డి మరణం

నెల్లూరు ట్రంకురోడ్డులో సాయిబాబా సైకిల్ మార్ట్‌ను స్వాతంత్ర్యం రాక ముందే స్థాపించి విజయవంతంగా నడిపిన పెద్దిరెడ్డి శంకరరెడ్డి(86) 16వ తేది మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. శంకరరెడ్డి గాంధీనగర్‌లోని సాయిబాబా మందిరం పాలకవర్గ సభ్యునిగా కూడా పనిచేశారు. ట్రంకురోడ్డులో సాయితేజ రెసిడెన్సీని కూడా 1993లో ప్రారంభించారు.

### డాక్టర్ రామచంద్రారెడ్డి తండ్రి మరణం

వ్యాపార దృక్పథంతో కాకుండా వృత్తి నైపుణ్యంతో తన దగ్గరకు వైద్యం కోసం వెళ్లే వారికి స్వాంతన చేకూర్చే నెల్లూరు శాంతినగర్‌లోని సింధూర నర్సింగ్ హోమ్ అధినేత, ఫిజీషియన్ డాక్టర్ జి.రామచంద్రారెడ్డి తండ్రి గడి వెంకటసుబ్బారెడ్డి(80) 17వ తేది మరణించారు. ఆయనకు డాక్టర్ కాకుండా మరో కుమారుదున్నాడు.

### రేబాల సుబ్బరామిరెడ్డి మరణం

నెల్లూరు విఆర్ కాలేజీలోని కామర్స్ విభాగంలో లెక్చరర్‌గా, రీడర్‌గా వివిధ హోదాల్లో పనిచేసి వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన రేబాల సుబ్బరామిరెడ్డి 17తేది నెల్లూరులో మరణించారు. విలక్షణ వ్యక్తిత్వం సుబ్బరామిరెడ్డి స్వంతం. స్వయంకృషితో పైకెదిగిన ఆయన అదే బాటన సాగమని పలువురిని ప్రోత్సహించేవారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె వున్నారు.

ఆత్మీయులను కోల్పోయిన పై మూడు కుటుంబాల వారికి మా ప్రగాఢ సానుభూతి.

# దొడ్ల రామచంద్రారెడ్డి ఓ తపస్వి... యశస్వి!



**నెల్లూరీయులంతా ప్రేమతో డిఆర్ అని పిలుచుకొనే కావలి విశ్వోదయ విద్యాసంస్థల స్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి 15వ తేది మరణించారు. డిఆర్‌లోని అన్ని కోణాలను ఆవిష్కరిస్తూ జవహర్ భారతి విద్యాసంస్థల మాజీ కరస్పాండెంట్ కె.వి.కోటిలింగం వ్రాసిన వ్యాసాన్ని ఈ సందర్భంగా పాఠకుల ముందుంచుతున్నాం. -సంపాదకుడు.**

అందరూ డి.ఆర్. అని ప్రేమతో, గౌరవంతో పిలుచుకొనే దొడ్ల రామచంద్రారెడ్డి 1929 జులై 4వ తేదీ దొడ్ల వేంకటరామిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ దంపతులకు కావలిలో జన్మించారు. ఐదుగురు ఆడపిల్లల తరువాత ఒక్కగానొక్క కుమారుడు. అల్లారుముద్దుగా పెరిగారు. కావలిలో విద్యాభ్యాసం తరువాత మద్రాసు లయోలా కళాశాలలో ఇంటర్మీడియట్, పచ్చయ్యప్ప కళాశాలలో డిగ్రీ చదివారు. డిగ్రీలో ఆంగ్లంలో బంగారు పతకం సాధించారు. అప్పటికి వారి వయస్సు 20 ఏళ్లు. మరలా కళాశాలకు సంబంధించిన కొన్ని కారణాల వల్ల, తన 38వ యేట మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చేరి ఎం.ఎ.ఫిలాసఫీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని 1967లో పుచ్చుకొన్నారు. తన మూడవ అక్క కూతురు సరళతో 1953లో ఆయన వివాహమైంది. నలుగురు సంతానం. ప్రస్తుతం విశ్వోదయ సంస్థల రెక్టార్‌గా పనిచేస్తున్న వినయకుమార్‌రెడ్డి ఈయన పెద్ద కుమారుడు. విట్స్ ఇంజనీరింగ్ కాలేజి కరస్పాండెంట్ విద్యాధర్‌కుమార్ రెడ్డి ఈయన రెండవ కుమారుడు. ఇద్దరు అమ్మాయిలు: శ్రీమతి శరత్కళ, లేట్ శ్రీమతి శ్రీకళ.

## చలించిన డిఆర్

వేమన చెప్పినట్లు "పురుషులందు పుణ్యపురుషులు" వేరు. వారు కారణజన్ములు, సమాజ కల్యాణానికి అంకితమై, నిరంతర కృషి సల్పడానికి జన్మిస్తారు. కాబట్టే డి.ఆర్. ప్రపంచంలోని ధనార్జనను, సుఖానుభూతులను చూడలేదు. ప్రపంచంలోని పేదల కష్టాలను చూశారు. చీకటిని చూశారు. వీటిని పారదోలే ప్రయత్నంలో గల జన్మసార్థకతను చూశారు. పొరుగువారిని ప్రేమించడంలోని మాధుర్యాన్ని చూశారు.

## ప్రభావం చూపిన ప్రముఖులు

డి.ఆర్. రవీంద్రుని విద్యాధర్మాలు, నెహ్రూ శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య ప్రియత్వం ఆకర్షించాయి. వాటికి మించి Victor Hugo నవల 'Les Miserables' లోని భావాలు వారి మనసుకు హత్తుకు పోవడం జరిగింది. Oliver Goldsmith రచన 'A City Night Piece'లో వర్ణించిన తాడితుల, పీడితుల దైన్యం, దౌర్భాగ్యం ఆయనను క్షోభకు గురిచేశాయి. 'They made me weep like a child' అని వారు తన డైరీలో రాసుకున్నాడు. ఆయన మద్రాసులో డిగ్రీ చేస్తుండగానే మినర్వా థియేటర్ ప్రాంతానికి వెళ్ళినపుడు పేవ్‌మెంట్ల మీది నిరుపేదలు, అన్నార్తులు దయనీయ స్థితిలో ఉండడం చూశారు. కావలికి వచ్చినపుడు చాకలి, మంగలి, పాలంకాపు మొదలగువారు చెప్పిన దీనగాధలు విన్నారు. ఇట్లాంటి ప్రపంచాన్ని మార్చి ఒక నూతన సమాజాన్ని ఆవిష్కరించడం ఎట్లా అని ఆయనలో మథన ప్రారంభమైంది.

## విద్యాదానం మహాదానం

ఆయన లేత మనస్సులో జరిగిన సాగర మథనం నుంచి అమృతం ఉద్భవించింది. ప్రపంచంలోని దాదాపు అన్ని అరిష్టాలకు విద్య సర్వరోగ నివారిణి అనే నిశ్చయానికి డిఆర్ వచ్చారు.

అన్నదానం మహాదానం విద్యాదాన మత:పరం

అన్నేన క్షణికా తృప్తి: యావజ్జీవంచ విద్యయా!

(మిగిలిన దానాలన్నీ తాత్కాలిక ఫలితాలనే ఇస్తాయి. విద్యాదానం మాత్రం వ్యక్తికి జీవితాంతం తోడునీడగా, జ్ఞానపథంగా, ఉపాధి మార్గంగా ఉపయోగపడుతుంది.)

## కార్యక్షేత్రం కావలియే!

డి.ఆర్. తమ కార్యక్షేత్రంగా కావలి ప్రాంతాన్ని ఎంచుకొన్నారు. దీనికి అనేక కారణాలున్నాయి. కావలి వారి స్వస్థలం. కావలి చుట్టుప్రక్క ప్రాంతాలన్నీ అవిద్యలోను, పేదరికంలోను మగ్గుతున్నాయి. వానలు తక్కువ, పంటలు అనుమానం, ఆదాయం స్వల్పం. ఇటువంటి ప్రాంతాన్ని తేజోవంతం చేయడానికి పూనుకొనడం గొప్ప సాహసమే.

ఒక గొప్ప సంస్థను, అందునా ఆదర్శాలే పునాదిగా గల సంస్థను స్థాపించాలంటే భగీరథ ప్రయత్నం కావాలి! సహకరించిన మహానుభావులు కళాశాల స్థాపనకు డి.ఆర్. అటువంటి భగీరథ ప్రయత్నమే చేశారు. పుచ్చలపల్లి హరిశ్చంద్రారెడ్డి వంటి వారి సహాయంతో తన స్వప్నాలకు సాకారం కల్పించారు. డాక్టర్ రామ్ వంటి వారి సహకారంతో సంస్థకు సామాజిక సేవా గంధం పూశారు. బెజవాడ గోపాలరెడ్డి వంటి వారి సహకారంతో సంస్థకు దాదాపు వంద ఎకరాల విశాల ప్రాంగణం ఏర్పరచారు. లేత భుజ స్కంధాలపై కొండంత బరువును మోయడం కష్ట సాధ్యం అని సందేహిస్తున్న తండ్రి వెంకట్రామిరెడ్డి గారిని ఒప్పించడమే కాకుండా, వారిచే భూరి విరాళం ఇప్పించారు. AMCGC టాంపో, డాక్టర్ ఎస్వీ భుజంగరాయశర్మ వంటి వారి నిత్య సలహాలతో సంస్థకు రూపురేఖలు దిద్దారు.

## కావలి కళాశాల

మొదట 1951లో " కావలి కళాశాల" పేరుతో ఒక కళాశాలను స్థాపించారు. ఆ ప్రయత్నం అంతటితో ఆగకుండా పూర్తిగా వికసించడానికి 1952లో విశ్వోదయ సంస్థను స్థాపించారు. క్రమక్రమంగా 1951లో 92 మంది విద్యార్థులతో స్థాపించబడిన కావలి కళాశాల ఓ గొప్ప విద్యాకేంద్రంగా విస్తరించి, వికసించడం ప్రారంభమైంది. అది 1953లో డిగ్రీ కళాశాల అయింది. బాలురకు ఒకటి, బాలికలకు ఒకటిగా రెండు ప్రత్యేక ఉన్నత పాఠశాలలు ఏర్పడ్డాయి. కొంత కాలం సంగీతం, నాట్యం మొదలగు లలిత కళల్లో కూడా శిక్షణ ఇవ్వడం జరిగింది. అనేక సంవత్సరాలు చిల్డ్రన్స్ స్కూల్ నడిచింది. "కావలి కళాశాల" 1965లో అప్పటి భారత ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా "జవహర్ భారతి" గా పునర్నామకరణం చేసుకొంది. 1994లో సంయుక్త కళాశాల డిగ్రీ, జూనియర్ కళాశాలలుగా విడవడింది. మరుసటి సంవత్సరం జూనియర్ కళాశాల పుచ్చలపల్లి హరిశ్చంద్రారెడ్డి జవహర్ భారతి జూనియర్ కళాశాలగా మారింది. డిగ్రీ కళాశాల కొంతకాలం అటానమస్ హోదాతో విరాజిల్లింది. లీడ్ కాలేజిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారిచే నిర్ణయింపబడింది. ఇటీవల కాలంలో సిపిఇ హోదా సంపాదించుకొంది. నాక్‌కు సంబంధించి 'A' గ్రేడ్‌లో నిలిచింది. కొంతకాలం నడిచి, మధ్యలో ఆగిపోయిన పి.జి. కోర్సులు మరలా ప్రారంభం అయి, వాటికి ఒక ప్రత్యేక కేంద్రం (డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు బ్లాక్) ఏర్పడింది. జవహర్ భారతి స్వర్ణోత్సవాల సమయంలో ఒక ఇంజనీరింగ్ కళాశాల ఏర్పడింది. ఇంకొక ఇంజనీరింగ్ కళాశాల పురుడు పోసుకుంటున్నది. ఈ విధంగా 1951లో నాటిన చిన్నమొలక క్రమంగా శాఖోపశాఖలుగా విస్తరిల్లింది, విస్తరిల్లుతున్నది.

## విశిష్ట బోధకులు

కాలేజీలో అధ్యయన వాతావరణం పెంపొందించడానికి డి.ఆర్. మొదటి నుండి ఎన్నో చర్యలు చేపట్టారు. దేశం నలుమూలల్లో ఉన్న గొప్ప గొప్ప వారిని లెక్చరర్స్‌గా జవహర్ భారతికి తీసుకొని వచ్చారు. కేవలం ప్రతిభ ప్రాతిపదికపై అధ్యాపకులను ఎంపిక చేశారు. తొలి సంవత్సరాలలో డి.ఆర్. ప్రతి క్లాసుకు వెళ్లి పాఠాలు చెప్పి, ప్రతిభగల విద్యార్థులను గుర్తించి, వారిని ప్రోత్సహించేవారు. విద్యార్థులకు అవసరమైన చక్కటి క్లాసురూములు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా మైదానం, హాస్టళ్ళు ఏర్పరచారు. " సెమినార్ సిస్టమ్" ద్వారా ఒక్కో లెక్చరర్‌కు సుమారు 15 మంది విద్యార్థి బృందాన్ని అప్ప జెప్పేవారు. టైంటేబుల్ లోనే ప్రతి శుక్రవారం చివరి గంట ఈ సెమినార్‌కు కేటాయించారు. ఈ సెమినార్‌లో అధ్యయన విషయాలతోపాటు విద్యార్థుల వ్యక్తిగత కష్టనిష్ఠూరాలు కూడా చర్చించి, వీలైనంత వరకు పరిష్కార మార్గాలు కనుగొనడం జరిగేది. కళాశాలలో ఇవి కాక, అనేక జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సదస్సులు జరిగాయి.

## బడుగుల పక్షపాతి

మొదటి నుండి డి.ఆర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ వచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బి.సి. వర్గాల పురోభివృద్ధికి విద్యతోపాటు భోజనం కూడా పెట్టాలన్న సత్సంకల్పంతో హాస్టల్స్‌ను ఏర్పాటు చేశారు. బాలికలకు ప్రత్యేకంగా ఒక హాస్టల్ ఏర్పడింది. హాస్టళ్ళు లేకపోతే తమకు అసలు విద్యాగంధమే అబ్బి ఉండేది కాదని ఎందరో పూర్వ విద్యార్థులు, విద్యార్థినులు పలు సందర్భాల్లో చెప్పారు.

## కళాకేంద్రం

సాంస్కృతికపరంగా విశ్వోదయ ఒక గొప్ప కళాకేంద్రం అయింది. పుచ్చలపల్లి హరిశ్చంద్రారెడ్డి ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో అడుగిడని ప్రఖ్యాత కవులు, గాయకులు, నృత్యకళాకారులు లేరంటే అతిశయోక్తి కాదు. డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారన్నట్లు ఒకసారి ఇక్కడకు వచ్చినవారు ఈ ప్రాంగణంలోనే పని చేయాలని గాఢంగా వాంఛిస్తారు. వివిధ రంగాలలో ప్రముఖులైన వారిని పిలిచి, వారిని విశ్వోదయ గౌరవ జీవిత సభ్యత్వంతో సత్కరించడం శ్రీ డి.ఆర్. పెట్టిన ఒక గొప్ప వరవడి.

## జన్మకు సార్ధకత

డి.ఆర్. విశ్వోదయ ఋషి. ఒక తాత్త్వికుడు. సంస్థ పురోగతికి సంబంధించి రాశిలోనూ, వాసిలోనూ ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్ష. వారు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "నా లక్ష్యం ఎంతవరకు సాధించానంటే 55 శాతమే. మెడికల్, బి.ఇడి, కాలేజీలు పెట్టాలనుకొన్నాం. కాని కుదరలేదు". విద్యాసంస్థల భవిష్యత్తు ఎలా ఉండాలో, వాటిని ఇంకా ఎలా తీర్చిదిద్దాలనే విషయాలపై వారు విశ్వోదయ పర్మెనెంట్ విజిటర్ విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ వంటి వారితో నిరంతరం సంప్రదిస్తూనే ఉంటారు. వారి మాటల్లోనే చెప్పాలంటే : " ఇప్పటి విద్యాసంస్థలలో విద్యార్థులతో ఉపాధ్యాయుల పర్సనల్ టచ్ క్రమేణా దూరమవుతోంది. గురుశిష్యుల మధ్య మునుపటి ప్రేమానురాగాలు, బాధ్యతలు కొరవడుతుండడం కొంత బాధాకరమే. కార్పొరేట్ విద్యారంగం వల్ల పేద విద్యార్థులకు విద్య గగనకుసుమం అవుతోంది. విద్యాసంస్థల నడుమ అనారోగ్యకరమైన పోటీ విద్యార్థులకు చేటు కలిగిస్తోంది. ఇదొక్కటే ఇప్పుడు నాకున్న బాధ" అన్నారాయన.

అయితే ఈ బాధ సమాజ కల్యాణానికి సంబంధించినది. షేక్స్పియర్ మాటల్లో చెప్పాలంటే, అది ద్వివిధంగా ధన్యమైనది. అది స్వాప్నికుడినీ, సమాజాన్ని కూడా ధన్యం చేస్తుంది. జన్మకు సార్థకత కలుగజేస్తుంది.

● నామమాత్రంగా నడుస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య

# ఇంతమెత్తనైతే పాలన మట్టిపాలే!

ముఖ్యమంత్రి రోశయ్యను చూస్తే పరిశీలకులకు జాలి కల్గుతున్నది. ప్రజలకు కోపం వస్తున్నది. మంత్రులకు నవ్వులాటగా వుంది. అధికారులకు తమషాగా వుంది. విలేకరులకు ఎగతాళిగా వుంది. వెరసి ఆయనొక ఆట బొమ్మగా మారిపోతున్నాడు. చులకనైపోతున్నాడు. చిల్లి గవ్వకు పనికిరాడనే చెడ్డ పేరు తెచ్చుకొంటున్నాడు.

ముఖ్యమంత్రి పదవి చాలా బాధ్యతాయుతమైనది. మొత్తం రాష్ట్రంలో మంచి జరిగినా చెడు జరిగినా ఆయనదే బాధ్యత. తప్పించుకోవడానికి లేదు. తప్పు వేరే వారి మీదకు నెట్టడానికీ కుదరదు. సమస్యలొస్తాయి. ఎనిమిది కోట్ల మంది ప్రజల పాలన అంటే కష్టాలు, ఇబ్బందులు, ఆటంకాలు, అల్లర్లు, ఆందోళనలు లేకుండా వుండవు. అది సహజం. సమస్యలను ఎదుర్కొని, పరిష్కారం వెతకడం ముఖ్యమంత్రి కర్తవ్యం. కానీ రోశయ్య సమస్యల నుంచి దూరంగా పారిపోతున్నాడు. తప్పించుక తిరగాలని చూస్తున్నాడు. ఏదీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాడు. నెల, రెండు నెలలు, మూడు నెలలు... పోనీలే అని జాలి పడవచ్చు. సమయం ఇవ్వాలని సర్ది చెప్పవచ్చు. కానీ ఏళ్లకాలం అదే తీరైతే ఇక ఆ పదవిలో ఆయనెందుకు?

రోశయ్య పదవి చేపట్టగానే కొందరు సీనియర్ మంత్రులు ఆయన్ను ముఖ్యమంత్రిగా గుర్తించదంలేదన్నట్లు ప్రవర్తించారు. మంత్రివర్గ సమావేశాలలో నిలదీసి మాట్లాడారు. మొదట మొదట వారిని సహించిన రోశయ్య ఆ తర్వాత గట్టి హెచ్చరిక చేశాడు. మంత్రివర్గ విస్తరణలో పీకి పారేస్తాడన్న భయం కల్గించాడు. దానితో కొంత అదుపులోకి వచ్చింది పరిస్థితి. కానీ ఇప్పుడు మళ్లీ మామూలైపోయింది. సమైక్యాంధ్ర ఉద్యమం పేరుతో మంత్రివర్గ సమావేశాలను బహిష్కరించాలని మంత్రులు ఆలోచన చేశారు. వారిని అదుపు చేయలేక జనవరి 2తేది సమావేశమే రద్దు చేశారు. 20తేది జరిగిన సమావేశంలో కథ మళ్లీ మొదటికి వచ్చింది. కరీంనగర్ జిల్లాలో నెలకొల్పదలచిన 2000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 700 మెగావాట్లకు కుదించడంపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గట్టిగా నిలదీశాడు. ఆర్థికంగా అది అంత లాభసాటి కాదనే అంచనాతో అధికారులే దాని సామర్థ్యం తగ్గించారని మంత్రులకు తెలుసు. కానీ తెలంగాణలో అదొక వివాదం కావడంతో తాను పోగొట్టుకొన్నానన్న ప్రతిష్ట సంపాదించడం కోసం శ్రీధర్ బాబు మంత్రివర్గసమావేశంలో రెచ్చిపోయాడు. దాన్ని చూసి పొన్నాల లక్ష్మయ్య, డికె అరుణ, బొత్సా సత్తిబాబు వంటి మంత్రులంతా ఇదే సందని రోశయ్య మీద విరుచుకపడ్డారు. నోటికొచ్చినట్లు మాట్లాడారు. మౌనం తప్ప రోశయ్య వద్ద సమాధానం లేదు. మంత్రులను అదుపుచేసే ప్రయత్నం లేదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సమస్య రోజురోజుకూ శృతి మించుతున్నది. తెలంగాణ మొత్తంలో జరుగుతున్న ఆందోళన ఒక ఎత్తు. విశ్వవిద్యాలయాల ప్రాంగణంలో జరుగుతున్నది ఒకటీ ఒక ఎత్తు. అదొక అగ్ని గుండంగా మారిపోతున్నది. ఈ సమస్య పరిష్కారానికి పోలీసు చర్య ఒకటి చాలదు. రాజనీతిజ్ఞత ప్రదర్శించాలి. కానీ రోశయ్య గారిలో ఆ స్పందన లేదు. పోలీసు వ్యవహారాలలో జోక్యం చేసుకోననే తరక వంటి మాటతో సరిపెడుతున్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. ఏ పనికీ డబ్బు లేదు. ఇష్టానుసారం పన్నులు పెంచినా ఫలితం రావడం లేదు. ఖజానాలో ఏ నెలకా నెల జీతాలకు వెతుక్కోవడానికే సరిపోతున్నది. ఎక్కడి ప్రాజెక్టులు అక్కడ నిలిచిపోయాయి. ప్రజలలో ఒక విధమైన నిరాసక్తత నిర్లిప్తత నెలకొంటున్నది. శాంతిభద్రతల పరిస్థితి మీద తీవ్ర ప్రభావం చూపే పరిణామం ఇది. కానీ ఆయనకు

కొరవ 14వ పేజీలో

## వెంకయ్యనాయుడు గారికి అనారోగ్యం



బిజెపి జాతీయ నాయకుడు, నెల్లూరుజిల్లా ప్రజలకు ఆరాధ్య ప్రాయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు అనారోగ్యానికి గురైనారు. 17తేది షష్టిపూర్తి పండుగను ఆనందంగా, ఆహ్లాదకరంగా జరుపుకొన్న నాయుడు గారు ఆ వెంటనే అనారోగ్యానికి లోను కావడం విచారకరం. హృదయ సంబంధిత రుగ్మతతో ఆయన హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో చేరారు. డాక్టర్ గోపీచంద్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిపిన వైద్యులు వెనువెంటనే యాంజియోప్లాస్టి జరిపి, మూడు స్టెంట్లు అమర్చారు. ఇప్పుడు ఆరోగ్యం కుదుటపడింది. కనీసం రెండు వారాల పాటు పూర్తి విశ్రాంతి కావాలని వైద్యులు సలహా ఇచ్చారు.

నాయుడుగారు వీలైనంత త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో, అదే చిరునవ్వుతో, అదే మాటల గాంభీర్యంతో తిరిగి రావాలని మనసారా కోరుకొంటున్నాము. భగవంతుడు ఆయనకు పరిపూర్ణ ఆయుర్దాయం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.




ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.
1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/-   జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

అశ్రునివాళి



ఆదరణ, అనురాగాలతో
అందరినీ అలరించిన
మమతానురాగాల అమృతమూర్తి,
మా ఇంటి వెలుగు, మా దైవం
శ్రీ పొర్లపల్లి వెంకట రమణయ్య గారు
తేది 11-1-2010 సోమవారం
మమ్ములను వీడి దైవసాన్నిధ్యం చేరారు.
వారి ఆత్మకు శాంతి కలిగించాలని
భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥ పొర్లపల్లి వెంకట రమణయ్య గారు
జననం : 8-7-1923   మరణం : 11-1-2010

భార్య
పొర్లపల్లి యశోదమ్మ

కుమారులు - కోడళ్లు
పొర్లపల్లి వెంకట సుధాకర్‌రావు - వెంకట సుజాత
పొర్లపల్లి భాస్కర్‌రావు - శైలజ

కుమార్తె
కొడవలూరు ప్రసూన

మనుమళ్లు
వెంకట జితేంద్ర, మహేంద్ర, ప్రదీప్

మనుమరాండ్రు
కళావతి, ఉష, హిమబిందు, తులసి, ప్రతిమ
మరియు
ముని మనుమళ్లు, ముని మనుమరాండ్రు

ఉత్తరక్రియలు
తేది 28-1-2010 గురువారం ఉదయం 10.00 గంటలకు మా స్వగృహము నెల్లూరు, L.I.C Colony, హరనాథపురం నందు జరుగును.


Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.